ప్రజాశక్తి

గురువారం 26 డిసెంబర్ 2024 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

సునామీకి 20 ఏళ్లు

- ఆ మాటంటేనే ఇప్పటికీ హడలిపోతున్న గంగపుత్రులు
- ఆనాటి చేదు జ్ఞాపకాలను నేటికీ మరిచిపోని మత్స్యకారులు

బింగినపల్లిలో సునామీ కాలనీ

ప్రజాశక్తి-శింగరాయకొండ

2004 డిసెంబర్ 26న ఆదివారం ఉదయం ఎనిమిది గంటల సమయంలో సముద్రం ఒక్కసారిగా ఉగ్రరూపం దాల్చింది. రాకాసి అలలు ఉవ్వెత్తున ఎగసి.. ఊరి మీద పడ్డాయి. ఆ అలల ధాటికి తీరప్రాంతం అల్లకల్లోలమైంది. పాకల సముద్ర తీరానికి ఆదివారం నాడు సరదాగా వచ్చిన కందుకూరుకు చెందిన ఆరుగురు, ఊళ్లపాలెం గ్రామానికి చెందిన ఆరుగురు మత్స్యకారులు.. మొత్తం 12 మంది ఈ రాకాసి అలల తాకిడికి మతి చెందారు. సునామీగా నామకరణం చేసిన ఈ ప్రకృతి వైపరీత్యం సంభవించి.. నేటికి 20 ఏళ్లయింది.

20 సంవత్సరాల నుంచి సునామీ అంటేనే గంగపుత్రులు హడలెత్తిపోతున్నారు. ఆనాడు సునామీ తాకిడికి మత్స్యకార కుటుంబాలు తల్లడిల్లిపోయాయి. నిత్యం సముద్రంపై జీవనం సాగిస్తున్న మత్స్యకారులకు ఆ సముద్రమే వచ్చి ఊరి మీద పడ్డట్టయ్యింది. మత్స్యకారులు తట్టుకోలేని దెబ్బ తగిలింది. అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సునామీ ఉదయం ఎనిమిది గంటలకు వస్తే మధ్యాహ్నం రెండు గంటలకల్లా ఊళ్లపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు వచ్చి సునామీ కారణంగా మండలంలో మరణించిన 12 మంది మృతదేహాలకు నివాళులర్పించి. సునామీ సృష్టించిన బీభత్సం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆ తరువాత మత్స్యకారులకు పెద్దఎత్తున రుణాలిచ్చి మళ్లీ వాళ్లు సముద్రంలో మత్స్య వేట చేసుకునే విధంగా అప్పటి ప్రభుత్వం చేయూతనిచ్చింది. సునామీ కారణంగా పాకల గ్రామపంచాయతీలోని పల్లిపాలెం చెల్లమ్మ గారి పట్టపాలెం పోతయ్య గారిపాలెం, క్రాంతి నగర్, శాంతినగర్ మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయారు. ఊళ్లపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని దేవలం పల్లెపాలెం బావి వద్ద పల్లెపాలెం మత్స్యకారులకు జరిగిన నష్టం అంతాఇంతా కాదు. పాకల గ్రామంలో సందర్శకులు చనిపోగా.. ఊళ్లపాలెం గ్రామంలో మత్స్యకారుడు గొల్లపోతు గోపాల్ అనే వ్యక్తి ఉదయాన్నే ఉప్పు కొటార్లకు వెళ్లి పని చేస్తుండగా ఆ ఉప్పు కొటార్ల వద్దకు తండ్రికి భోజనం తీసుకుపోయిన రాజ్యం, అపర్ణ అనే అక్క చెల్లెళ్లతో పాటు అదే గ్రామానికి చెందిన మంగమ్మ, శ్రీనివాసులుతో పాటు మరికొందరు ▶ 2లో

వీడని వాన

- 15 గ్రామాలపై ముసురు ప్రభావం
- దెబ్బతిన్న మినుము, మిర్చి, వరి
- ఆందోళనలో రైతన్నలు

దోర్నాలలో మిర్చిపై కప్పిన పట్టలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

వరుస తుపానులతో జిల్లా రైతాంగం అల్లాడిపోతున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వచ్చిన ముసురు వీడిపోలేదు. ముసురు ప్రభావం 15 గ్రామాలపై పడింది. మినుము, మిర్చి, వరి దెబ్బతినే అవకాశం ఉంది. వివిధ ఇతర పంటలకు సైతం నష్టం వాటిల్లింది. ముసురు ఇదే విధంగా కొనసాగి వర్షాలు కురిస్తే పంటలు ఉరకెత్తే అవకాశాలు ఉన్నాయి. ఇదే సమయంలో చలిపులి పెరిగింది.

జిల్లాలో ముసురు ప్రభావం కొనసాగుతోంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లావ్యాప్తంగా చిరు జల్లుల నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలోని 38 మండలాలలో వర్షాలకు కురియటం విశేషం. కురుస్తున్న వర్షాలలో కనిగిరి డివిజన్ పరిధిలోని పామూరులో 15 గ్రామాలపై ముసురు ప్రభావం పడింది. రబీ సీజన్‌లో రైతులు మినుములతో పాటు మిర్చి, పొగాకు, శనగ, కూరగాయలు, వరి, ఇతర పంటలు వేశారు. ఆయా పంటలు ఎదిగే దశలో ఉన్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు కొనసాగితే పంటలు ఉరకెత్తే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో 6.9 మి.మీ.ల వర్షపాతం

ముసురు కారణంగా కురుస్తున్న వర్షాలతో జిల్లావ్యాప్తంగా 6.9 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కొండపిలో అత్యధికంగా 17.2 మిల్లీమీటర్లు, హనుమంతునిపాడులో అత్యల్పంగా 2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలోని వివిధ మండలాలలో కురిసిన వర్షపాతం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. పుల్లలచెరువులో 16 మిల్లీమీటర్లు, కొత్తపట్నంలో 15,6 , జరుగుమల్లిలో 12.6, సంతనూతలపాడులో 11.8, తాళ్ళూరులో 11.6, ముండ్లమూరులో 11.2, యర్రగొండపాలెంలో 10.6, ఒంగోలులో 10.6, చీమకుర్తిలో 10.2, మర్రిపూడిలో 9.8, సింగరాయకొండలో 9.4, నాగులుప్పలపాడులో 9.2, మద్దిపాడులో 8 మి.మీ.లు ▶ 2లో

ప్రాణాలు కబళిస్తున్న కిడ్నీ వ్యాధి

కిడ్నీ వ్యాధితో మృతిచెందిన కొండ్రు ఇస్సాకు (ఫైల్)

డయాలసిస్ చేయించుకుంటున్న రాణెమ్మ

- పిట్టల్లా రాలిపోతున్న డయాలసిస్ రోగులు
- రోజురోజుకూ పెరుగుతున్న బాధితుల సంఖ్య
- తాగునీటి వసతి లేకపోవడమే కారణం

ప్రజాశక్తి-పిసిపల్లి

డయాలసిస్ రోగులు పిట్టల్లా రాలిపోతున్నారు. కొత్తగా కిడ్నీ వ్యాధిగ్రస్తులు రోజురోజుకూ పెరుగుతున్నారు. మండలంలో 40 మంది దాకా డయాలసిస్ రోగులు కనిగిరి ప్రభుత్వ వైద్యశాలలో ఉచితంగా డయాలసిస్ చేయించుకుంటున్నారు. మరికొంతమంది నెల్లూరు, చెన్నై, గుంటూరు ప్రాంతాలకు వెళ్లి డయాలసిస్ చేయించుకుంటున్నారు. డయాలసిస్ చేయించుకునే రోగుల సంఖ్య పెరగడం ఆందోళన కలిగిస్తోంది. కలుషితమైన నీరు తాగటమే ఇందుకు కారణం. మండలంలోని విజయనగర కాలనీలో ఇటీవలే కిడ్నీ వ్యాధితో ఇద్దరు మృత్యువాతపడ్డారు.

కనిగిరి ప్రాంతంలో కిడ్నీ రోగుల సంఖ్య ఎక్కువ. అందులో పీసీపల్లి మండలంలో మరీ ఎక్కువ. పీసీపల్లి పంచాయతీలో అధికంగా ఉన్నారు. పంచాయతీలోని పిసిపల్లి, విజయనగర కాలనీ, గోపవరపువారిపల్లి, బుడ్డారెడ్డిపల్లి, దళిత కాలనీలో అదనంగా ఉన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో వ్యాధిగ్రస్తులు ఉన్నారు. కిడ్నీ వ్యాధి రోగులు లేని గ్రామం లేదు. కలుషిత నీరే కిడ్నీ వ్యాధికి కారణంగా వైద్యులు నిర్ధారించారు. ఈ విషయాన్ని 2007లోనే సిపిఎం, జన విజ్ఞానవేదిక, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ గుర్తించాయి. జనవిజ్ఞానవేదిక, యుటిఎఫ్ నాయకులు దివాకరపురం, వెంగళయపల్లి, నేరేడుపల్లి, బుడ్డారెడ్డిపల్లి గ్రామాల్లో నీటిని సేకరించి ల్యాబ్‌కు పంపారు. నీళ్లలో విషతుల్యమైన రసాయనాలు ఉన్నాయని పరీక్షల్లో తేలింది. అప్పట్లో హైదరాబాద్ నిమ్స్ వైద్యశాలకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ రాజారెడ్డి నీటిని పరిశీలించి ఇక్కడి భూగర్భజలాలు తాగటం వల్లే కిడ్నీలు చెడిపోతున్నాయని తెలిపారు. భూమి లోపల నీటిలో విష రసాయనాలు ఉన్నాయన్నారు. ఈ నీరు తాగటం వల్ల కిడ్నీ వ్యాధి ప్రబలుతుందని అప్పుడే హెచ్చరించారు. ఈ హెచ్చరికను ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ఈ విషయమై సిపిఎం అనేక సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చింది. ఆందోళనలు, పోరాటాల మూలంగా కొన్ని గ్రామాలకు మాత్రమే తాగేందుకు సాగర్ నీటిని పైపులైను ద్వారా అరకొరగా అందిస్తున్నారు. ఈ మధ్యకాలంలో కిడ్నీ రోగుల సంఖ్య ఎక్కువగా పెరిగింది. రక్తపరీక్షలు చేయించుకుంటే ఎక్కువ మందిలో కిడ్నీల్లో మసక వచ్చిందని, ఇప్పుడిప్పుడే చెడిపోతున్నాయని, జాగ్రత్తగా ఉండాలని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. వయస్సుతో సంబంధం లేకుండా అందరికీ ఈ వ్యాధి వస్తోంది. 30 ఏళ్ల లోపు వారు కూడా ఈ వ్యాధితో బాధపడుతున్నారు. గతంలో అప్పటి ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రమణ్యం శాసనమండలిలో ఇక్కడి సమస్యపై అనేకసార్లు ప్రస్తావించారు. గత ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు శాసనమండలిలో ▶ 2లో

హ్యాపీ క్రిస్మస్

క్రిస్మస్ పండుగ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా క్రైస్తవులు చర్చిలలో బుధవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చిలన్నీ విద్యుత్ కాంతులతో కళకళలాడాయి. పలు చోట్ల చిన్నారులు ఆటపాటలతో అలరించారు. కేక్ కట్ చేసి.. సంబరాలు చేసుకున్నారు.

- ప్రజాశక్తి, ఒంగోలు

వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ దామోదర్

'పగలే చోరీ' కేసులో నిందితురాలు అరెస్టు

రూ.12.50 లక్షల సొత్తు స్వాధీనం

▶ 7లో

సునామీ కారణంగా ఊళ్ల పాలెంలో దెబ్బతిన్న వలల భవనం(ఫైల్)

సునామీకి 20 ఏళ్లు

(మొదటిపేజీ తరువాయి)

ఉప్పుకొటార్లలో పనులకు వెళ్లి రాకాసి అలల ధాటికి మరణించారు. తీర ప్రాంతంలో ఉన్న గిరిజనులపై కూడా ఈప్రభావం పడింది. గిరిజనులు తీవ్రంగా నష్టపోయారు. అప్పుడు హైదరాబాద్ రియల్ ఎస్టేట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బింగినపల్లి గిరిజన కాలనీలో సునామీ కాలనీ నిర్మించి.. ఆ కాలనీని రియల్ ఎస్టేట్ అసోసియేషన్ బందం ప్రారంభించింది. ఆ కాలనీలో సుమారు 200 గహాలకు పైగా రియల్ ఎస్టేట్ హైదరాబాద్ బందం వచ్చి నిర్మించినవే.. ఊళ్లపాలెం గ్రామంలో సముద్రం ఒడ్డున వలలో బోట్లు వేసుకునేందుకు ఓ రూము నిర్మాణం జరుగుతుండగా సునామీ వచ్చిన తర్వాత ఆ అలల తాకిడికి ఆ రూము దెబ్బతింది. అక్కడ ఉన్న మత్స్యకారులు సునామీ గుర్తుగా నేటికీ ఆ రూమును అలాగే ఉంచేశారు. డిసెంబర్ వచ్చిందంటే మత్స్య వేట అంతంత మాత్రం గానే ఉంటుంది. ఓ పక్క తుపాను హెచ్చరికలు , మరో పక్క సునామీ జ్ఞాపకాలతో బోటు తీయాలంటేనే మత్స్యకారులు భయపడుతున్నారు.

'సునామీ'కి ఒక బాబు..

'సునామీ'కి ఒక బాబు.. 'గాలివాన' తాత అయ్యాడు.. ఇదేంటి అనుకుంటున్నారేమో.. శింగరాయకొండ మండలం, చెల్లెమ్మ గారి పట్టపాలెంలో మత్స్యకార గ్రామంలో ఓ వ్యక్తి పేరు గాలివాన. 1980లో పెద్ద గాలివాన వచ్చి పెద్ద తుపాను సంభవించిన సమయంలో ఇతను పుట్టడంతో అతనికి ఈ కుటుంబ సభ్యులు 'గాలివాన' అని పేరు పెట్టారు. ఈ 'గాలివాన' దంపతులకు 2004 డిసెంబర్ 26న ఒక పాప పుట్టింది. ఆ రోజు సునామీ రావడంతో ఆ పాపకు 'సునామీ'గా నామకరణం చేశారు. ఇప్పుడు 'సునామీ'కి పెళ్లయ్యి.. ఓబాబు కూడా పుట్టాడు. దీంతో 'గాలి వాన' తాతయ్యాడు.

వీడని వాన

(మొదటిపేజీ తరువాయి)

కొనకనమిట్లలో 7, దోర్నాలలో 6.8, టంగుటూరులో 6.8,పొన్నలూరులో6.4, పొదిలిలో 6.2, త్రిపురాంతకంలో 5.4,కురిచేడులో 5.4, తర్లుపాడులో 5.4, దర్శిలో 5.2, పెద్దచెర్లోపల్లిలో 4.6, మార్కాపురంలో 3.8, అర్ధవీడులో 3.6, సిఎస్‌పురంలో 3.6, పామూరులో 3.6, దొనకొండలో 3,కనిగిరిలో 3, గిద్దలూరులో 2.8, వెలిగండ్లలో2.8, పెద్దారవీడులో 2.6, కొమరోలులో 2.6, కంభంలో 2.4, రాచర్లలో 2.4, బేస్తవారిపేటలో 2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

ప్రాణాలు కబళిస్తున్న కిడ్నీ వ్యాధి

(మొదటిపేజీ తరువాయి)

ప్రస్తావించారు. మండలానికి వచ్చి కిడ్నీ రోగాలను స్వయంగా పరిశీలించి.. వారి బాధలు తెలుసుకొని ప్రస్తావించినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేదు. ఈ విధంగా సురక్షిత నీటి సౌకర్యం లేక మండలంలో కిడ్నీ వ్యాధితో బాధపడేవారు ఎక్కువ మంది ఉన్నారు.

మాజీ జడ్పీటీసీ కుటుంబమంతా..

మండలంలోని విజయనగరకాలనీకి చెందిన మాజీ జడ్పీటీసీ కోండ్రు రాణెమ్మ సోదరులు చెరుకూరి యాకోబు, చెరుకూరి దావీదు కిడ్నీ వ్యాధితో గతంలో చనిపోయారు. యాకోబు కుమారుడు పెద్దయ్య కూడా ఇదే వ్యాధితో రెండు నెలల క్రితం మృతిచెందారు. రాణెమ్మ భర్త కోండ్రు ఇస్సాకు కిడ్నీ వ్యాధితోనే ఆదివారం రాత్రి చనిపోయారు. ఈయనకు సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. మంగళవారం రాణెమ్మ కనిగిరి ప్రభుత్వాసుపత్రిలో డయాలసిస్ చేయించుకున్నారు. రాణెమ్మ మరో సోదరుడు నారయ్య నెల్లూరులో డయాలసిస్ చేయించుకుంటున్నారు.

అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం

'అయోడిన్'పై అవగాహన

ప్రజాశక్తి - శింగరాయకొండ

మండల పరిధిలోని పలు గ్రామాల్లో ది ఇన్స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో అయోడిన్ యొక్క ఉపయోగాలు, నష్టాల గురించి కళాజాతా బృందం బుధవారం అవగాహన కల్పించింది. గ్రామాలలో అవగాహన సదస్సులు, వీధి నాటకాల ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ది ఇన్స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ శ్రీను మాట్లాడుతూ అయోడిన్ లోపం వల్ల థైరాయిడ్, మానసిక వైకల్యం, ఏకాగ్రత లోపించడం, అంగవైకల్యం, మానసిక అభివృద్ధి లోపించడం లాంటి సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. వయోజన మహిళలు, బాలలు పాలిచ్చే తల్లులు, గర్భిణులు అయోడిన్ లోపం వల్ల అనేక ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. శరీరంలో అయోడిన్ సరైన మోతాదులో అమోడిన్ లేకపోవడమేనని అందుకు కారణ మని తెలిపారు. అయోడిన్ అధికంగా ఉండే సముద్రపు చేపలు, ఆకు కూరలు, తాజా పండ్లు, కూర గాయలు, గుడ్లు,పాలు, చిరు ధాన్యాలను తీసుకోవడం ద్వారా శరీరంలో అయోడిన్ లోపాన్ని నివారించవచ్చునని తెలిపారు. నేటి ఆధునిక ప్రపంచంలో సరైన ఆహారము లేకపోవడం వల్ల శరీరానికి కావాల్సిన పోషక పదార్థాలు అందక అయోడిన్ లోపం ఏర్పడి అనేక అనారోగ్య సమస్యలకు దారి తీస్తుందన్నారు. మనం తీసుకునే ఆహారంలో కార్బోహైడ్రేట్స్, ప్రోటీన్లు, విటమిన్లు, మినరల్స్ సమపాళ్లో ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది బాపట్ల దివ్య, కళాజాత బృందం సభ్యులు, ఆశా, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

దామచర్ల సత్యకు సత్కారం

దామచర్ల సత్యను సన్మానిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

పాలేరు–బిట్రగుంట సప్లయి ఛానల్ చైర్మన్ మందలపు గాంధీ చౌదరి రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్యను బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాలేరు–బిట్రగుంట ఛానల్ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు గురించి చర్చించారు. నెల్లూరు జిల్లా, కందుకూరు మండలం, జల్లెలమూడి గ్రామం వద్ద పాలేరు నదిలో ఇసుక మేట వేయటం ద్వారా బింగినపల్లి వరకూ నీరు రావటం ఇబ్బందిగా ఉందని దామచర్ల సత్యకు గాంధీ చౌదరి వివరించారు. సమస్యను త్వరలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోతానని, జిల్లా అధికారుల ద్వారా పూర్తి సమాచారం సేకరిం చాలని సత్య సూచించారు. సత్యను కలిసిన వారిలో గనిపినేని రవిచౌదరి, గుళ్ల వెంకటేష్ చౌదరి తదితరులు ఉన్నారు.

ముసురుతో రైతులకు తీరని నష్టం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

ఈ ఏడాది మిర్చి పంట ఆదుకుంటుందని అనుకునే లోపే అకాల వర్షంతో మిర్చి రైతుకు మరో ఎదురుదెబ్బ తగిలింది. గత రెండు రోజుల పాటు వాతావరణంలో మార్పు చోటుచేసుకుని, ముసురు, తుప్పర్లతో వర్షం కురుస్తూ ఈదురు గాలులు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే మిర్చి కోతలు కోసి కల్లాల్లో ఆరబెట్టిన మిర్చి పంట తడిసి ముద్దయింది. తెరిపి ఇవ్వగానే పట్టలు తీసి మిర్చిని ఆరబెట్టేలోపు తిరిగి తుప్పర్లు కురుస్తూ రైతులను ఇబ్బంది పడుతున్నాయి. కొందరు రైతులు వాతావరణ మార్పును గమనించక కల్లాల్లో మిర్చి పంటపై రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో మిర్చి తడిసింది. మరికొందరు రైతులు అప్రమత్తమై మిర్చి రాశులపై టార్పాలిన్లు కప్పి మిర్చి వర్షం బారిన తడవకుండా రక్షించుకున్నారు. తడిసిన పంట రంగు మారి నాణ్యత కోల్పోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే ఇప్పటికే కొన్ని గ్రామాల్లో మిర్చి పంటకు నల్లి తామర పురుగు ఆశించడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. నల్లి తామర పురుగు దాడిలో మిగిలిన కాస్తో కూస్తో పంట చేతికొచ్చింది అనుకుంటే ఇప్పుడు అకాల వర్షం కురవడంతో రైతులకు నష్టం వాటిల్లింది. నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-కొండపి

మండల పరిధిలోని కట్టావారిపాలెం గ్రామంలో మన ఊరి ఆరోగ్య వికాసం సంస్థ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. దుప్పట్ల పంపిణీకి కట్టావారిపాలెం గ్రామానికి చెందిన చింతల వెంకయ్య కుమారుడు వెంకట అఖిల్ ఆర్థిక సాయం అందించారు. మన ఊరి వికాసం వ్యవస్థాపకులు, ఎన్ఆర్ఐ ధర్మవరపు ప్రసాదు చేతుల మీదుగా దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం ధర్మవరపు ప్రసాద్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కట్టా రవికుమార్, ప్రధాన కార్యదర్శి వీరమోసు మస్తానరావు, కార్యకర్తలు ధర్మవరపు అజయ్, కట్టా రాము, మామిళ్ళపల్లి అక్కారావు, బెజవాడబుజ్జి, బొడ్డపాటి నరసిహారావు, బక్కముంతల వెంకటరావు, కుంచాల వెంకటరావు, గూడూరు శ్రీను, రావులపల్లి కోటేశ్వరరావు, ఆరికట్ల రాఘవులు, కోటపాటి లక్ష్మి నరసింహం, గంగరాజు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహారాజ శ్రీ దర్శి సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

ఐ.పి.నెం :10/2022

రాగి వెంకట రెడ్డి ...పిటిషనర్

వర్సెస్

గాయం నారాయణరెడ్డి మరియు వగైరాలు .... రెస్పాండెంట్స్

టు

70వ రెస్పాండెంట్ అయిన గొలమారి వెంకటేశ్వర రెడ్డి తండ్రి అల్లూరయ్య , మిట్టమీదపల్లి గ్రామం & భూపతిపల్లె పోస్ట్, మార్కాపురం మండలం.

71వ రెస్పాండెంట్ అయిన పుబ్బ నాగేశ్వర రెడ్డి , తండ్రి బ్రహ్మయ్య , పునుగోడు గ్రామం, కనిగిరి మండలం, ప్రకాశం జిల్లా.

దావా సమను

పై నెంబరు పిటిషన్‌లో మీరు 70,71 వ రెస్పాండెంట్స్ అయి ఉన్నారు. కావున పై నెంబర్ కేసు తే: 27-12-2024దిన మీ నోటీసు కొరకు వాయిదా ఉన్నది. కావున పై నెంబరు దావా యందు మీకు ఎటువంటి ఆక్షేపణలు ఉన్న యడల తే: 27-12-2024దిన ఉదయం 10:30 గంటలకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని లేక లాయర్ గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలాముగా మీకు తెలియజేయడమైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ప్రదేశం : దర్శి

తేదీ : 23-12-2024

వాయిదా తేదీ : 27-12-2024 ఇట్లు

ఎస్.ఎం.బాషా,
అడ్వకేట్
పొదిలి/దర్శి, ప్రకాశం జిల్లా,
ఫోన్ నెం : 9949435269.

బహిరంగ ప్రకటన

మా క్లయింట్ అయిన **పాదర్తి సుబ్బాయమ్మ,** భర్త **వెంకటేశ్వర్లు,** R/o Door No.4-302, అయ్యన్న స్ట్రీట్, దిబ్బల రోడ్ దగ్గర, ఒంగోలు టౌన్, ప్రకాశం జిల్లా. అను వారు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం క్రింది షెడ్యూల్ ఆస్థిలో ఇండ్లు కట్టుకొని ఆమె నివసించుచున్నారు. ఈ షెడ్యూల్ ఆస్థికి సంబంధించి ఎవరైనా ఫేక్ డాక్యుమెంట్‌లు తయారు చేసి విక్రయించినయెడల మా క్లయింటుకు ఎటువంటి సంబంధం లేదు. ఎవరైనా ఫేక్ డాక్యుమెంట్‌లు తయారు చేసిన యెడల మా క్లయింటు తీసుకొనబోవు చట్టపరమైన చర్యలకు బాధ్యులు అవుతారు. షెడ్యూలు ఆస్థిపై మా క్లయింటు తప్ప ఎవరికి ఎటువంటి హక్కులు లేవని బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

షెడ్యూలు

ప్రకాశం జిల్లా, ఒంగోలు మండలం, ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, కేశవరాజుకుంట, ముక్తినూతలపాడు సర్వే నెం.180/2ఎ, ప్లాటు నెంబరు 312, డోర్ నెం.312/27-48-435, అసెస్‌మెంట్ నెంబరు : 1035059656, కరెంటు సర్వీసు మీటర్ SC No. 4353606125281, R.C.C.Building House and House Vacant Site an extent of Ac: 0.01 1/2 Cents **Bounded by : East :** Plot No.311, **South :** Plot No.313, **West:** Road, **North:** Road.

ఇట్లు
కొల్లూరు వెంకట నరసింహా రావు
దేగా సురేష్
చిమట సింహాద్రి
అడ్వకేట్స్
సింగరాయకొండ - 523101,
ప్రకాశం జిల్లా, సెల్: **98485 09619**

మహారాజశ్రీ అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

O.S.No.191/2004

1.గుంటూరు హనుమంతరావు (died) &...ఇతరులు

Vs.

1. షేక్ మస్తాన్ సాహెబ్ @ పసరు (died) & ఇతరులు ..... ప్రతివాదులు

ప్రకటన.

To

D3) షేక్ మస్తాన్ బి W/o సింగయ్య
ఇసుక దర్శి గ్రామము, మార్టూరు మండలము,
ప్రకాశం జిల్లా (old) బాపట్ల జిల్లా (ప్రస్తుతం)

D4) షేక్ మీరాబి W/o దావలి,
దూదేకులపాలెం, అద్దంకి టౌన్ & మండలము,
బాపట్ల జిల్లా

D5) షేక్ బాజి W/o నబీసాహెబ్, వంకాయలపాడు
గ్రామము, ఇంకొల్లు మండలము, బాపట్ల జిల్లా

పై నంబరు దావాలో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినప్పటికి మీరు దురుద్దేశ్య పూర్వకముగా తీసుకొనక తిరిగి పంపుచున్నందువలన మీకు పై నంబరు దావా లో నోటీసును ఈ ప్రకటన ద్వారా కోర్టువారు జారీ చేసి మీ హాజరు నిమిత్తం ఈ దావాను తేది.07-01-2025నకు వాయిదా వేశారు. కావున మీరు ఆ తేదిన ఉదయం గం.10-30 ని.లకు పై కోర్టువారి ఏదుట స్వయముగాగాని వకీలు ద్వారాగాని హాజరయి పైదావాలో మీ ఆక్షేపణలను తెలియజేయవలెను. లేని ఏడల పై దావాను మీ పరోక్షమందు తీర్మానించదరని తెలియ జేయడమయినది.

// శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో //

వజ్రాల అంజిరెడ్డి
మారం శ్రీనివాసరావు,
తాడికొండ ప్రసాద్ బాబు,
వాది తరుపు న్యాయవాదులు,
అద్దంకి

మహారాజశ్రీ అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

O.S.No.68/2023

మోరబోయిన వీరయ్య ...... వాది

Vs

1.మోరబోయిన లక్ష్మయ్య & others ...... ప్రతివాదులు

ప్రతివాదులు

To:

1. మోరబోయిన బాల వీరయ్య
S/o లేట్ ఏడుకొండలు (5వ ప్రతివాది)
2. మోరబోయిన అంజలి D/o లేట్ ఏడుకొండలు (6వ ప్రతివాది) ఇద్దరి నివాసం : కాకానిపాలెం, అద్దంకి టౌన్ & మండలము, బాపట్ల జిల్లా

పై నంబరు దావా లో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినప్పటికి మీరు దురుద్దేశ్యపూర్వకముగా తీసుకొనక తిరిగి పంపుచున్నందువలన మీకు పై నంబరు దావా లో నోటీసును ఈ ప్రకటన ద్వారా కోర్టువారు జారీ చేసి మీ హాజరు నిమిత్తం ఈ దావాను తేది : 29-01-2025 నకు వాయిదా వేశారు. కావున మీరు ఆ తేదిన ఉదయం గం.10-30 ని.లకు పై కోర్టువారి ఏదుట స్వయముగాగాని వకీలు ద్వారా గాని హాజరయి పై దావా లో మీ ఆక్షేపణలను తెలియజేయవలెను. లేని ఏడల పై దావాను మీ పరోక్షమందు తీర్మానించదరని తెలియజేయడ మయినది.

// శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో //

వజ్రాల అంజిరెడ్డి,
మారం శ్రీనివాసరావు,
తాడికొండ ప్రసాద్ బాబు.
వాది తరుపు న్యాయవాదులు,
అద్దంకి

వికలాంగులతో మాట్లాడుతున్న దామచర్ల సత్య

వికలాంగులకు అండగా ప్రభుత్వం

మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య

ప్రజాశక్తి-శింగరాయకొండ

వికలాంగులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ అన్నారు. బుధవారం శింగరాయకొండకు చెందిన యువనేస్తం ఫౌండేషన్ చైర్మన్, ప్రకాశం డిస్ట్రిక్ట్ బీసీ కార్పొరేషన్ జిల్లా అధ్యక్షుడు అంకిపల్లి బంగారు బాబు ఆధ్వర్యంలో దామచర్ల సత్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు వికలాంగులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని, కమిటీ హాల్ నిర్మించుకోవడానికి స్థలం కేటాయించాలని కోరారు. దామచర్ల సత్య స్పందిస్తూ త్వరలో మీకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి మండల కన్వీనర్ సన్నిబోయిన నాగేశ్వరరావు, మండల అధ్యక్షులు ఆరేటి వేణుగోపాల్, మండల కార్యదర్శి అన్నం వీరప్రతాప్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-చీమకుర్తి

క్రిస్మస్ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. స్థానిక క్రిస్టియన్ పాలెంలోని చర్చిలో ఎఎంసి మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి 300 మంది పేదలకు దుప్పట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో బండారు శ్రీను, పాడిబండ్ల కోటయ్య పాల్గొన్నారు. వైయస్ భారతి ఫౌండేషన్ అధ్యక్షురాలు పాడిబండ రాజసులోచన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 150 మంది పేద మహిళలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, మాజీ కౌన్సిలర్ పాడిబండ్ల శారద, పాటిబండ్ల దానమ్మ, జీవన్ కుమార్ అబ్రహం పాల్గొన్నారు

అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన

ప్రజాశక్తి-సంతనూతలపాడు

పార్లమెంటులో అంబేద్కర్‌ని అవమాన పరచటం అంటే రాజ్యాంగాన్ని అవమానించినట్లేనని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని మంగమూరులో అంబేద్కర్ విగ్రహం ఎదుట బుధవారం జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా అంబేద్కర్‌ని అవమానించేలా మాట్లాడటంతో బిజెపి నిజస్వరూపం ఏమిటో బయటపడిందని అన్నారు. రాజ్యాంగం మనకు స్వేచ్ఛ, స్వాతంత్రం కల్పించిందని మన రాజ్యాంగం గొప్ప విలువలతో కూడుకున్నదని నేటికీ ఆదర్శనీయంగా ఉన్నదని అన్నారు. అలాంటి రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి మనుధర్మ శాస్త్రాన్ని, చాతుర్వర్ణ వ్యవస్థను ముందుకు తీసుకొస్తున్నదని తెలిపారు. రాజ్యాంగం ద్వారా పదవులు అనుభవిస్తూ ఆ రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేయాలని పూనుకోవడం దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడబోతుందని అన్నారు. భవిష్యత్తులో బిజెపి, ఆర్ఎస్ఎస్ మనువాద భావజాలానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్యవాదులు ముందుకు రావాలని, అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి జంగం బాబురావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో కె.అజయ్, చెన్నకేశవులు, డి.శ్రీను, కె.రాజు, తిప్పాబత్తిన రాము, అబ్బూరి వెంకటేశ్వర్లు, ఎస్.కె మస్తాన్, కె.నాగేశ్వరరావు, కె.శివ, మంచికలపాటి శ్రీను, కె.రాజేష్, డి.ధనుంజయ, కట్టా ప్రసాద్, డి.వెంకటేశ్వర్లు, పోతురాజు, కె.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘం నాయకులు

'పోరుబాట'ను విజయవంతం చేయండి

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-సంతనూతలపాడు

కరెంటు చార్జీలు తగ్గిస్తానంటూ బూటకపు హామీలు గుప్పించి చంద్రబాబు గద్దెనెక్కాడని, పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని ఈ నెల 27న నిర్వహించనున్న పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసీపీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి అన్నారు. బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. పోరుబాట నిరసన కార్యక్రమం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దుంపా చెంచిరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు అబద్దాలు, మోసాలు మరోసారి రుజువవుతున్నాయన్నారు. వాటిని ప్రజలు గుర్తించాలని కోరారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాదరెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి మేరుగు నాగార్జున ఆధ్వర్యంలో ఒంగోలు చర్చి సెంటర్లోని వైఎస్సార్ విగ్రహం నుంచి ఎస్ఈ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి నిరసన తెలుపుతామన్నారు. జగనన్న ప్రభుత్వంలో ఉచితంగా 200 యూనిట్లు ఇస్తే ప్రస్తుతం వాళ్ల ఇంటికి కూడా ట్రూఅప్ చార్జీల పేరుతో వేలల్లో బిల్లులు వస్తున్నాయన్నారు. ఉన్న జీవోస్థితనే ప్రజలు అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జనం చంద్రబాబుకు ఓట్లు వేస్తారని, తర్వాత ఆయన వాతలు పెడతాడన్నారు. కరెంటు చార్జీలు తగ్గించే వరకు పోరాటం ఉధృతం చేస్తామన్నారు. నాలుగు మండలాల వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఈ పోరుబాటలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ చైర్మన్ దుంపా యలమందారెడ్డి, కోఆప్షన్ నెంబర్ రహమతుల్లా, ఎస్సీ సెల్ నాయకులు దమ్మాల శ్రీను, కుంచాల నాగాంజనేయులు, తన్నీరు మోహనరావు, పల్లెపు శ్రీను, కరకు సుబ్బారావు, కొత్తపల్లి వెంకట సుబ్బయ్య, నల్లగట్ల రామాంజనేయులు, కుంచాల నాగరాజు, రహీం, యేసు రత్నం తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-వేటపాలెం

వాకింగ్ చేస్తుండగా గుర్తు తెలియని బైక్ ఢీకొని గాయాలపాలై చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. ఈనెల 19వ తేదీన వేటపాలెంకు చెందిన తాపీ మేస్త్రీ బాణాల లక్ష్మీ నారాయణ వాకింగ్ చేస్తుండగా బైక్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. 108లో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం బుధవారం సాయంత్రం మృతదేహాన్ని స్వగృహానికి తీసుకొచ్చారు. లక్ష్మీ నారాయణకు పదో తరగతి చదివే కొడుకు ఉన్నాడు. మంగళవారమే తన పుట్టిన రోజు కావడంతో శుభాకాంక్షలు చెప్పకుండా ఇలా చేశావ్ ఏంటి నాన్నా అంటూ కొడుకు సాయి చరణ్ ఏడవడం స్థానికులను కటతడి పెట్టించింది. పట్టణంలోని పలువురు ప్రముఖులు నివాళులు అర్పించారు. కాగా బైపాస్‌లో జబ్బర్ కాలనీలో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ ద్విచక్ర వాహనాన్ని వారం రోజులుగా పోలీసులు గుర్తించలేకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా పోలీసులు లక్ష్మీనారాయణ మృతికి కారకుడైన ద్విచక్రవాహనదారుడిని గుర్తించి శిక్షించాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలైన సంఘటన బుధవారం నాగులుప్పలపాడు కోకిల కోల్డ్ స్టోరేజీ వద్ద జరిగింది. వివరాల మేరకు.. మండలంలోని చదలవాడ గ్రామానికి చెందిన రావూరి సుబ్బారావు ఉప్పుగుండూరు వచ్చి తిరిగి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కోకిలకోల్డ్ స్టోరేజీ సమీపంలోకి రాగానే స్టోరేజీ లోపల నుంచి లారీ ఒక్కసారిగా రోడ్డుపైకి రావడంతో ద్విచక్రవాహనం లారీ కి ఢీకొని సుబ్బారావు కింద పడిపోయాడు. దీంతో తలకు గాయాలయ్యాయి. 108లో ఒంగోలు వైద్యశాలకు తరలించారు.

మహిళను మోసం చేసిన వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి-కొల్లూరు

పోలీసు ఉద్యోగం చేస్తున్నాని నమ్మించి పెళ్లి చేసుకున్నాడని మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కొల్లూరు ఎస్ఐ జి.ఏడుకొండలు తెలిపిన వివరాల మేరకు.. కొల్లూరు గ్రామానికి చెందిన పరిశ రోజా రంగమ్మకు 2022లో మేడేపల్లి పృథ్వీరాజ్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. నేను ఆర్ఎస్ఐగా పనిచేస్తున్నానని చెప్పి రంగమ్మతో పరిచయం పెంచుకున్నాడు. అనంతరం 2024లో పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నాడు. వివాహం అనంతరం పృథ్వీరాజ్ పోలీసు కాదని, కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని, అతనికి అంతకుముందే పెళ్లి అయినట్లు తెలిసింది. అంతేకాకుండా రంగమ్మ అక్క పిల్లల దగ్గర నుంచి ఉద్యోగం ఇప్పిస్తానని కొంత డబ్బు తీసుకున్నాడు. ఈ మేరకు రంగమ్మ కొల్లూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇచ్చారు. కొల్లూరు ఎస్ఐ జి.ఏడుకొండలు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం దుకాణంలో చోరీ

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణంలోని కాలేజీ రోడ్డులో డిఎస్ఆర్ వైన్స్ షాపులో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. మద్యం దుకాణంలోని 18 మద్యం బాటిళ్ల గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లారు. రాత్రి సమయంలో జన సంచారం లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు దుకాణం వద్ద ఉన్న సీసీ కెమెరాలను పగులకొట్టి దుకాణం వెనుక వైపు నుంచి లోపలికి చొరబడి 18 మద్యం బాటిళ్లు తీసుకెళ్లారు. దుకాణ యజమాని బుధవారం ఉదయం ఈ విషయాన్ని గుర్తించి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ యు.నాగరాజు, పట్టణ ఎస్ఐ ఎం.సైదుబాబులు చోరీ జరిగిన తీరును పరిశీలించారు. మందు బాబులు ఈ చోరీకి పాల్పడినట్లు గుర్తించారు.

కార్యకర్తకు అన్నా రాంబాబు పరామర్శ

ప్రజాశక్తి- మార్కాపురం రూరల్

స్థానిక ఇరవై వార్డుకు చెందిన మాజీ వాలంటీర్, వైసీపీ కార్యకర్త బూసిరాజు ప్రసాద్ ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. ప్రసాద్ అనారోగ్య విషయం తెలుసుకున్న గిద్దలూరు మాజీ శాసనసభ్యులు, మార్కాపురం నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త అన్నా రాంబాబు బుధవారం ప్రసాద్ గృహానికి వెళ్లి పరామర్శించి అతని అనారోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. వైద్యుల సూచనలు మేరకు విశ్రాంతి తీసుకోవాలని ఏదైనా సమస్య ఉంటే తనను ఏ సమయంలోనైనా సంప్రదించవచ్చునన్నారు.

నరసింహారావు ఆశయాలు కొనసాగిస్తాం

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జయంతి

ప్రజాశక్తి-చీమకుర్తి

డాక్టర్ ఎంవిఎల్ నరసింహారావు ఆశయాలు కొనసాగిస్తామని లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బి.జవహర్ అన్నారు. దివంగత డాక్టర్ ఎంవిఎల్ నరసింహారావు (చీమకుర్తి కంటి డాక్టర్) 104వ జయంతి వేడుకలు చీమకుర్తి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక జవహర్ నర్సింగ్ హోంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ చలువాది బదరీ నారాయణ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.జవహర్ మాట్లాడారు. నరసింహారావు ఆయన చేసిన సేవలను కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. మద్దిపాడు ఎఎంసి మాజీ చైర్మన్ చావా వెంకారెడ్డి మాట్లాడుతూ ఎంవిఎల్ నరసింహారావు చీమకుర్తిని రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చిన వైద్యులని పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ పి విజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏడాది డాక్టర్ ఎంవిఎల్ నరసింహారావు జయంతి సందర్భంగా సేవలు నిర్వహిస్తున్న డాక్టర్ బి జవహర్ అభినందనీయులని పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు నూనె హేమ సుందర్ రావు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ రెహమాన్, ఎస్.కె భాష, గోపురపు చంద్ర, జెవివి అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు, యుటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కె అక్బర్, చలువాది శ్రీనివాసరావు, ఎ.వీరారెడ్డి, ఏపీపీఎఫ్ నాయకులు జి.యాకోబు, నూనె వంశీకృష్ణ మాట్లాడారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ నాయకులు

లయన్స్ క్లబ్ చేపట్టిన సేవా కార్యక్రమాలు

వృద్ధులు, పేద క్రైస్తవులకు దుప్పట్లు మరియు చీరలు పంపిణీ, ఇద్దరికి కుట్టు మిషన్లు అందజేశారు. ప్లాట్ ఫారాలపై పనిచేసుకునే పలువురు కార్మికులకు లయన్స్ గొడుగులు అందజేశారు. పలు పాఠశాలకు స్పెషల్ టీచర్ గ్రాంటును అందజేశారు. ఎన్ఎస్‌పి ప్రాథమిక పాఠశాలకు వాటర్ బాటిల్స్, ఇనుప గేటును అందజేశారు. పేద కళాకారుని భార్యకు పెన్షన్ అందజేశారు. స్థానిక ఎస్‌కెఆర్ బధిరుల పాఠశాలకు రూ.2 వేలు, రామతీర్థం గోశాలకు రూ.10 వేలు, నల్గొండ మహాత్మా గాంధీ దేవాలయానికి రూ. వెయ్యి అందజేశారు. ఈ కార్యక్రమాలలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్లు చలువాది బదరీ నారాయణ, నూనె వెంకట సుబ్రహ్మణ్యం, లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు నూనె హేమ సుందర రావు, ఎస్.ఆంజిరెడ్డి, కోశాధికారి చలువాది పార్థసారధి, ప్రాజెక్టు కోఆర్డినేటర్ వి.సుబ్బరామయ్య, డైరెక్టర్ చలువాది రమేష్, నూనె అనుదీప్, గెలాక్సీ లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కొండవీటి ఏడుకొండలు, బొడ్డు ఆంజనేయులు, కోశాధికారి ఆలపాటి నరసింహారావు, మందపాటి శ్రీనివాసరావు, కే.వడ్డీ కాసులు, మద్దాలి శ్రీహరి, నూనె శివ తదితరులు పాల్గొన్నారు.

ఖురాన్ కంఠస్త పోటీలు

ప్రజాశక్తి - మార్కాపురం రూరల్

మార్కాపురంలోని చిన్న మసీదులో ఖురాన్ కంఠస్త పోటీలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెఐహెచ్ రాష్ట్ర సలహా మండలి సభ్యులు అష్రఫ్ అలీ మాట్లాడుతూ గత 10 సంవత్సరాల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలలో 120 మంది పాల్గొనగా, 18 మంది రాష్ట్రస్థాయి క్వార్టర్ ఫైనల్‌కు ఎంపికయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఎఈ షేక్ మహబూబ్ బాషా, అడ్వకేట్ మొగల్ అన్వర్ బేగ్, టీడీపీ మైనార్టీ నాయకులు పఠాన్ హుసేన్ ఖాన్ పాల్గొని విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెఐహెచ్ పట్టణ అధ్యక్షుడు సికిందర్, ఎస్ఐఓ పట్టణ అధ్యక్షుడు అరాఫత్, మసీదు ఇమామ్‌లు రహమాన్, జెఐహెచ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒడ్డుకు చేరిన పడవలు

తుపాను ప్రభావంతో అలల ఉధృతి

ప్రజాశక్తి-శింగరాయకొండ

పశ్చిమ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో గత రెండు రోజులుగా చిన్నపాటి వర్షాలు మొదలయ్యాయి. బుధవారం రాత్రి నుంచి వర్షం ఎక్కువ కావడంతో పాటు సముద్ర తీరంలో అలలు ఉధృతి కనిపిస్తోంది. సముద్రంలో అలల తాకిడి కారణంగా మత్స్యకారులు గత రెండు రోజులుగా వేట నిలిపివేశారు. వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో మత్స్యకారులు వేటకు వెళ్లకుండా మెరైన్ పోలీసులు అప్రమత్తమయ్యారు.

రూరల్ సిఐగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల రూరల్ సిఐగా కె. శ్రీనివాస రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ఎలాంటి సమస్యలున్నా నేరుగా తమను సంప్రదించవచ్చునని ఆయన తెలిపారు. ప్రజలతో మమేకమై ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థను కాపాడతామని తెలిపారు. చట్ట విరుద్ధంగా కార్యకలాపాలు నిర్వహించేవారి సమాచారం తమకు అందించాలని కోరారు.

విజేతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

విజేతలకు అభినందనలు

ప్రజాశక్తి-బాపట్ల

ఢిల్లీ యూనివర్సిటీలో ఇటీవల ప్రపంచస్థాయిలో అబాకస్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 30 దేశాల నుంచి 7 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. బాపట్ల, చీరాల నుంచి యూసి మాస్ సంస్థకు చెందిన 8 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. అందరూ ఆయా విభాగాల్లో 3 వ స్థానంలో నిలిచి ట్రోఫీలు సాధించినట్లు యూసిమాస్ బాపట్ల డైరెక్టర్లు స్టెల్లీ, బొనిగల రాజేంద్రప్రసాద్ తెలిపారు. విజేతలకు యూసిమాస్ కార్యాలయంలో బుధవారం అభినందన సభ నిర్వహించారు. సభలో ఎమ్మెల్యే నరేంద్రవర్మ పాల్గొనివిజేతలుగా నిలిచిన చిన్నారులకు ట్రోఫీలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అబాకస్ నేర్చుకోవడ ద్వారా చిన్నారుల్లో ఏకాగ్రత పెరుగుతుందన్నారు. పిల్లలు కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు సాహితీ, టిడిపి పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాస్, మదిరి భూషణ్ రావు, పిన్నిబోయిన శ్రీమన్నారాయణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'పోరుబాట'ను జయప్రదం చేయాలి

వైసిపి సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు

ప్రజాశక్తి-వేమూరు

కరెంట్ ఛార్జీల పెంపును నిరసిస్తూ ఈనెల 27న నిర్వహిస్తున్న పోరుబాట కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని వైసిపి నియోజక వర్గ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు తెలిపారు. వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పోరుబాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వేమూరు గ్రామంలోని రైల్‌గేట్ వద్దనున్న కీర్తిశేషులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర రెడ్డి విగ్రహం వద్ద నుంచి విద్యుత్ కార్యాలయం వరకు శాంతియుతంగా నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా విద్యుత్ ఛార్జీలు పెంచమని అబద్ధపు హామీలతో చంద్రబాబు నాయుడు గద్దెనెక్కినట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చాక నిత్యావసరాల ధరలు విపరీతంగా పెంచి పేదవాడి రక్త మాంసాలను పీల్చి పిప్పిచేస్తున్నట్లు తెలిపారు. అధిక భారాలపై ప్రజలు అల్లాడి పోతున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వ నాయకులకు కనువిప్పు కలిగేలా శాంతియుతంగా నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నష్టాల బాటలో 'పూల' రైతులు

- వర్షానికి దెబ్బతిన్న బంతి తోటలు
- తగ్గిన దిగుబడి
- పెట్టుబడి కూడా రాని వైనం
- ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి-ఇంకొల్లు

బంతిపూలు తోటలు సాగు రైతులకు నష్టాలు తప్పేలా కనిపించడం లేదు. పూల మొక్కలు నాటినప్పటి నుంచి రైతులు అనేక కష్టాలకు గురవుతున్నారు. తోటల్లో మొగ్గ,పూత దశ ప్రారంభం నుంచి కురుస్తున్న వర్షాలు, మారిన వాతావరణంతో పూల దిగుబడి తగ్గింది. పూలు కోత ప్రారంభ దశలో కిలో రూ.50 రూపాయలు పలికింది. అనంతరం వర్షాల కారణంగా బంతిపూల పరిమాణం తగ్గింది. పూలు చిన్నవిగా మారాయి. అంతే కాక ఎక్కువ మంది రైతులు పూలసాగు చేపట్టారు. దీంతో పూలకు గిరాకీ తగ్గింది. మండల పరిధిలోని ఇంకొల్లు, భీమవరం పావులూరు, వంకాయలపాడు అంకిరెడ్డిపాలెం తదితర గ్రామాలలో రైతులు బంతిపూల సాగు చేపట్టారు.అదేవిధంగా కారంచేడు మండలంలోని నాయుడు వారి పాలెం, దగ్గుబాడు, తిమ్మిడిపాడు, పోతినవారి పాలెం గ్రామాలలో కూడా పూల సాగు చేపట్టారు. పర్చూరు, చిన్నగంజాం మండలంలోని పూల పెంపకం దారులు చీరాల, వేటపాలెం తో పాటు బాపట్ల సమీప గ్రామాల్లోనూ సాంప్రదాయపద్ధంగా ఏటా పూలతోటలు చేస్తున్నారు. పెదనందిపాడు, పత్తిపాడు, గుంటూరు, పొన్నూరు తదితర ప్రాంతాల గ్రామాలలో నూతనంగా కొంతమంది రైతులు బంతి పూలసాగు చేపట్టారు. గత ఏడాదికన్నా ఈ ఏడాది ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోనూ రైతులు బంతి సాగు చేపట్టారు. దిగుబడి తగ్గినప్పటికీ గిరాకీ లేదు. అయ్యప్ప స్వాములు మాలలు ధరించే సమయం పుష్యమాసం, కార్తీక మాసం ధనుర్మాసంలో వివిధ పూజా కార్యక్రమాల కోసం బంతిపూలతో పాటు పది రకాల పూలను వినియోగిస్తారు. అయ్యప్ప, భవాని, శివ, ఆంజనేయ స్వామి, వెంకటేశ్వర స్వామి మాలాదారులు ఎక్కువగా పూజలు నిర్వహిస్తూ పూలను వాడతారు. ఈ ఏడాది వారు కూడా పూల వినియోగాన్ని తగ్గించారు. దానికి తోడు పూల సాగు పెరిగింది. దిగుబడులు తగ్గినప్పటికీ ధరలు ఆశించిన స్థాయిలో లేవని రైతులు చెబుతున్నారు. తోట వద్దకు వచ్చే వ్యాపారాలు కేజీ రూ.40 రూపాయలకు మించి కొనుగోలు చేయలేదని రైతులు చెబుతున్నారు. పూల దిగుబడి తక్కువగా ఉన్నప్పుడు ప్రారంభ దశలోనూ, చివరి దశలో పూలకు గిరాకీగా ఉంటుంది. పుష్పించిన పూలు పక్వానికి వచ్చి ఎక్కువ రోజులు చెట్టునే నిల్వ ఉండటం వల్ల అవి దెబ్బతిని వాడిపోతున్నట్లు రైతులు వాపోతున్నారు. దీనికి తోడు ఈ ఏడాది తెగుళ్ళ కూడా ఆశించినట్లు తెలిపారు. ఏది ఏమైనప్పటికీ పూల సాగు చేసిన రైతులు తమకు నష్టాలు, కష్టాలు తప్ప లాభాలు లేవని చెబుతున్నారు. పూల మొక్కలు నాటి నుంచి ఎరువులు, వ్యవసాయం, పురుగుమందులు, నాట్ల కూలి, దుక్కి, వ్యవసాయం, కలుపు తదితర ఖర్చులతో పాటు కోతకూలి పెరిగినట్లు రైతులు చెబుతున్నారు. ఎకరా పొలంలో బంతి సాగుకు రూ.70 వేల నుంచి రూ.80 వేల వరకూ ఖర్చు అవుతున్నట్లు ఇంకొల్లు రైతు మండల భాను ప్రకాష్ తెలిపారు. పెట్టిన పెట్టుబడిలో కోత కూలి కూడా రావటం కష్టంగా ఉందనితెలిపారు. వర్షాల కారణంగా తోటలు దెబ్బతిన్నట్లు తెలిపారు. దెబ్బతిన్న మొక్కలను పీకి వేయడం తప్ప మరో మార్గం లేదని ఆయన తెలిపారు.

తత్కాల్ పథకం కింద పరీక్ష ఫీజు చెల్లించేందుకు అవకాశం

ప్రజాశక్తి-బాపట్ల

రాష్ట్ర సార్వత్రిక విద్యాపీఠం నిర్వహిస్తున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశానికి తత్కాల్ అడ్మిషన్ షెడ్యూలు ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. పురుషోత్తం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సాధారణ అడ్మిషన్ ఫీజుకు అదనంగా రూ 600 తత్కాల్ రుసుము చెల్లించాలన్నారు. ఈనెల26 నుంచి 31 వరకూ ఫీజు చెల్లించవచ్చునని డిఇఒ తెలిపారు.

తల్లపనేని నానికి మాతృవియోగం

ప్రజాశక్తి- భట్టిప్రోలు

మండల పరిధిలోని పెదపులివర్రు గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు తల్లపనేని నానికి మాతృవియోగం కలిగింది. ఆయన తల్లి స్వరూపరాణి అనారోగ్యంతో బుధవారం మృతిచెందారు. స్వరూపరాణి మృతదేహాన్ని బీసీ సెల్ వేమూరు నియోజకవర్గ అధ్యక్షుడు బట్టు మల్లికార్జునరావు, ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి సుందరరావు, ఎస్‌సి సెల్ వేమూరు నియోజకవర్గ ఉపాధ్యక్షులు శాంసన్, పోకూరి సురేంద్ర, మైనారిటీ సెల్ భట్టిప్రోలు మండల ఉపాధ్యక్షుడు ఇబ్రహీం బేగ్ తదితరులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నివాళులర్పిస్తున్న బట్టు మల్లికార్జున్

క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్లలోని సిబిజెడ్ చర్చిలో బుధవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ ప్రార్థనల్లో బాపట్ల ఎంపీ, ప్యానల్ స్పీకర్ తెన్నేటి కృష్ణప్రసాద్, శిరీష దంపతులు, ఎమ్మెల్యే నరేంద్ర వర్మ పాల్గొన్నారు. ఏసుక్రీస్తు పుట్టిన పవిత్ర రోజు క్రిస్మస్ పండుగను ఆనందంగా జరుపు కోవాలని తమ సందేశంలో పేర్కొన్నారు.అందరిపట్ల కృతజ్ఞత, ప్రేమ ,కరుణ కలిగి ఉండాలన్నారు. క్రీస్తు బోధనలను ఆదర్శంగా తీసు కోవాలని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

చుండూరు : మండల పరిధిలోని అంబేద్కర్ నగర్ లూథరన్ చర్చిలో క్రీస్తు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులు నూతన వస్త్రాలు ధరించి క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు పాస్టర్ మాట్లాడుతూ అందరూ దేవుడి ప్రేమతో మెలగాలన్నారు. అన్ని ఆలయాల్లో క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు

సంతమాగులూరు : మండల పరిధిలోని కుందుర్రు గ్రామంలో క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా విశ్రాంత హెడ్ కానిస్టేబుల్ నూనె పిచ్చయ్య జ్ఞాపకార్థంగా వారి కుమా రులు నూనె నాని, నూనె రమేష్, నూనె రాజేష్ చీరలు వితంతువులు, వృద్ధ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. నూనె నాని దంపతులు ఉపాధ్యాయులు , రెండో కుమారుడు రాజేష్ హైదరాబాదులో సైంటిస్టుగా పనిచేస్తున్నాడు. దాతలకు గ్రామ స్తులు అభినందనలు తెలిపారు.

ప్రముఖ కవి 'తుమ్మల'కు నివాళి

ప్రజాశక్తి బాపట్ల

తెనుగులెంక అభినవ తిక్కన అనే బిరుదులతో ప్రముఖ కవి తుమ్మల సీతారామమూర్తి తెలుగు సాహితీ లోకంలో తమ స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారని ప్రజా కవి, ప్రముఖ వైద్యులు డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. తుమ్మల సీతారామమూర్తి 123వ జయంతి సాహితీ భారతీయ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా సీతారామమూర్తి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ తుమ్మల సీతారామ మూర్తి గజాగోహణము, గండపెండేరధారణ, బంగారు కంకణాలతో అనేక సత్కారాలు పొందిన గొప్ప కవి అని వివరించారు. అప్పికట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హిందీ అధ్యాపకుడు అబ్దుల్ ఖాదర్ జిలాని మాట్లాడుతూ సీతారామమూర్తి అప్పికట్ల, బాపట్ల, నిడుబ్రోలు ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా పని చేశా రన్నారు. మహాత్మా కథ, అమర జ్యోతి, గాంధీ గానము వంటి గ్రంథాలలో గాంధీ గురించి గొప్పగా వర్ణించారన్నారు. సీతారామమూర్తి పని చేసిన పాఠశాలలో తాను హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేయడం తనకెంతో గర్వంగా ఉందన్నారు. సీతారామమూర్తి స్వాతంత్ర్యోద్యమంలో జైలు శిక్షణ అనుభవించారన్నారు

నివాళులర్పిస్తున్న నిర్వాహకులు

సాహితీ రుద్రమ ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ

ఆంధ్ర సరస్వతీ బిరుదాంకితులైన ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ గొప్ప స్త్రీవాద కవి అని సాహితీ భారతీ అధ్యక్షుడు రావూరి నరసింహ వర్మ తెలిపారు. ఊటుకూరు లక్ష్మీకాంతమ్మ 107వ జయంతి సందర్భంగా సాహితీ భారతీ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ లక్ష్మీకాంతమ్మ స్త్రీలే రాసిన కథలతో కథామందారం అనే సంకలనాన్ని ఆవిష్కరించారన్నారు. నా తెలుగు మాంచాల ,కన్యకమ్మ నివాళి, హంస విజయము, జాతిపిత ,కాంతి శిఖరాలు, అమతవల్లి వంటి రచనలు ఆమె కలం నుంచి జాలు వారాయన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీ భారతి కోశాధికారి ఆదాం షఫీ, ఇస్మాయిల్ జబీయుల్లా, ఎం.జాకబ్, కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రాజాకు సిపిఎం నేతల నివాళి

నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-టంగుటూరు

సిపిఎం నాయకులు పారా కోటయ్య, వరలక్ష్మిల మూడో కుమారుడు పారా రాజా (రాజశేఖర్) ఏ.పి. ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తూ మంగళవారం మధ్యాహ్నం గుండెపోటుతో మరణించారు. టంగుటూరులో బుధవారం వారి ఇంటి వద్ద రాజా భౌతిక కాయానికి సిపిఎం రాష్ట్ర నాయకులు జాలా అంజయ్య పూలమాల వేసి.. నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.ఆంజనేయులు, జిల్లా నాయకులు బి.రఘురామ్, టి.రాము, వి.మోజెస్, ఎం.వెంకటేశ్వర్లు, సిపిఐ నాయకులు ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-2025 క్యాలెండర్‌ను మారిటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య బుధవారం ఒంగోలులోని ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఆవిష్కరణ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జరుగుమల్లి మండలం, అక్కచెరువుపాలెం గ్రామ నాయకులు కొమ్మాలపాటి కృష్ణ, టంగుటూరు మండల సీనియర్ నాయకులు ఈదర ప్రభాకరరావు, జమ్ములపాలెం నాయకులు మక్కెన వెంకటరావు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి నివేదిక అందజేశాం: డిఇఒ

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

జిల్లాలో ఖాళీగా ఉన్న ఉర్దూ ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేయమని ప్రభుత్వానికి నివేదిక అందజేశామని జిల్లా విద్యాశాఖాధికారి ఏ.కిరణ్ కుమార్ తెలిపారు. ప్రజాశక్తి దినపత్రికలో ఈనెల 24వ తేదిన 'ఉర్దూ విద్యకు గ్రహణం' అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. దానికి జిల్లా విద్యాశాఖాధికారి ఏ కిరణ్ కుమార్ స్పందించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం త్వరలో జారీ చేయబోయే డిఎస్సి నోటిఫికేషన్ నందు అవసరమైన మేరకు ఎస్‌జిటి (ఉర్దూ) మరియు స్కూల్ అసిస్టెంట్ (ఉర్దూ) పోస్టులు నోటిఫై చేయుటకు ప్రభుత్వానికి నివేదిక అందజేశామన్నారు. పోస్టులు మంజూరు కాగానే జిల్లాలో ఉన్న ఉర్దూ ఖాళీ పోస్టులను భర్తీ చేస్తామని తెలిపారు.

అజాత శత్రువు పోతుల చెంచయ్య

ప్రజాశక్తి-టంగుటూరు

మహోన్నతమైన వ్యక్తి, అజాత శత్రువు జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ పోతుల చెంచయ్య అని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలాశ్రీ బాల వీరాంజనేయస్వామి కొనియాడారు. కీర్తిశేషులు పోతుల చెంచయ్య 28వ వర్ధంతి కార్యక్రమం టంగుటూరులోని కందుకూరు మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు స్వగృహంలో జరిగింది. కందుకూరు మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మంత్రి స్వామి. ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులరెడ్డి, రాష్ట్ర మారిటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యనారాయణ, ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్ ముఖ్యఅతిథులుగా హాజరై.. ఘనంగా నివాళులర్పించారు. అనంతరం టంగుటూరు పంచాయతీ పారిశుధ్య కార్మికులకు, వివిధ వర్గాలలోని పేద ప్రజలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులను పోతుల రామారావు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. తదుపరి టంగుటూరులోని పురం సెంటర్, బస్టాండ్ సెంటర్, జమ్ములపాలెం, కాకుటూరు వారిపాలెం, జయవరం, బాపూజీ కాలనీలోని పోతుల చెంచయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి.. నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పోతుల నరసింహారావు, పోతుల కృష్ణారావు, పోతుల రాజేంద్రప్రసాద్, టిడిపి మండల కన్వీనర్ కామని విజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, టంగుటూరు మాజీ సర్పంచ్ బెల్లం జయంత్ బాబు, టీడీపి గ్రామ అధ్యక్షులు కామని నాగ శ్రీను, మాజీ డీసీఎంఎస్ ఛైర్మన్ బెల్లం సత్యన్నారయణ, చిడిపోతు సుబ్బరావు, చిడిపోతు వెంకటేశ్వర్లు, కనుకుర్తి శ్రీధర్, పోతుల రామారావు, చిడిపోతు కోటేశ్వరరావు, సిహెచ్.లక్ష్మయ్య, కామినేని కోటేశ్వరరావు, రావూరి సతీష్‌బాబు, గుడిపూడి నరసింహారావు, నవులూరి సురేంద్ర, చదలవాడ వేణు పాల్గొన్నారు.

నివాళులర్పించిన మంత్రి స్వామి

పోతుల చెంచయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి స్వామి

నిత్యావసరాలు అందజేస్తున్న దృశ్యం

కేకులు పంపిణీ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్దదోర్నాల, పెద్దారవీడు మండలాల్లో ఉన్న చర్చీలకు యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ స్థానికంగా ఉండే మండల నాయకుల ద్వారా బుధవారం క్రిస్మస్ కేకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యర్రగొండపాలెం సర్పంచ్ రామావత్ అరుణాబాయి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పంపించిన క్రిస్మస్ కేకును స్థానికంగా గల చర్చిలో అందజేశారు.

మాజీ రాష్ట్రపతి జైల్‌సింగ్‌కు నివాళి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

భారతదేశపు ఏడో రాష్ట్రపతి జ్ఞాని జైల్‌సింగ్ 30వ వర్ధంతి కార్యక్రమం బుధవారం యర్రగొండపాలెం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి.. నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షులు ముత్తలూరి మల్లికార్జునచారి మాట్లాడుతూ పంజాబ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా పంజాబ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా, కేంద్ర హోం శాఖ మంత్రిగా ఆయన సేవలు మరవలేనివన్నారు. ఆయన భారతదేశపు ఏడో ప్రధానిగా పని చేశారన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు జమ్మాజు వెంకటేశ్వరచారి, బొద్దోజు బాలయోగి, రంగోజు మల్లికార్జున చారి, నందిగం అంజి, ముత్తలూరి సత్యనారాయణచారి, జి.సత్యనారాయణ, జి.వెంకటాచారి, ఆర్.నారాయణ, శరవాచారి పాల్గొన్నారు.

చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు

క్రిస్మస్ వేడుకలలో పాల్గొన్న చిన్నారులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

క్రిస్మస్ పండుగ సందర్భంగా మండల వ్యాప్తంగా బుధవారం పలు చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. యర్రగొండపాలెం పట్టణంలోని స్థానిక యల్ఈఎఫ్, హోసన్నా, తెలుగు బాప్టిస్ట్, కప మినిస్ట్రీస్, తండ్రి సన్నిధి, వివిధ ప్రార్థన మందిరాలలో క్రిస్మస్ పండుగ వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లు మోషే, అయ్యర్ జయదేవ్, సుందర్‌రావు ప్రసంగిస్తూ యేసుక్రీస్తు సర్వ మానవాళికి శాంతి సందేశాన్నిచ్చి ప్రేమ మార్గంలో ఎవరి మనసునైనా జయించవచ్చునని తన జీవితం ద్వారా నిరూపించారని అన్నారు. ప్రేమమార్గంలో ఎంత ఘోర పాపినైనా తన క్షమాపణ గుణంతో క్రీస్తు సన్మార్గంలోకి నడిపించారని తెలిపారు. క్రీస్తు చూపిన మార్గం అనుసరణీయమని, ప్రతి ఒక్కరూ యేసు క్రీస్తు వాలే ఇతరుల పట్ల దయ, ప్రేమ, కరుణ, జాలి, మంచి మనసు, క్షమాగుణం కలిగి ఉండాలన్నారు. యేసుక్రీస్తు భోధనలు అనుసరిస్తే జీవితంలో శాంతి, సమాధానం ఉంటుందన్నారు. సమాజంలో సుస్థిరమైన శాంతి, అహింస, ఒకరికొకరు పరోపకారులుగా ఉండటం, పొరుగువాని యెడల జాలి కలిగి ఉండాలని భోదించారు. జీసస్ అహింసావాదని తన మీద దాడి చేసిన వారికి హాని తల పెట్టకుండా ప్రజల శ్రేయస్సు కోసం భరించినటువంటి యేసుక్రీస్తు మహోన్నతుడని కొనియాడారు. అనంతరం సండే స్కూల్ చిన్నారులు యాక్షన్ సాంగ్స్, నత్య ప్రదర్శన చేశారు. అనంతరం క్రిస్మస్ కేకులు కట్ చేసి అందరికీ పంచారు. ఈ క్రిస్మస్ వేడుకలలో క్రైస్తవ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు ఆచరణీయం

పెద్దదోర్నాల: పెద్దదోర్నాలలోని బాప్టిస్ట్ సంఘ కాపరి రెవరెండ్ పాస్టర్ ముండ్ల కపాకర్ క్రిస్మస్ పర్వదినము పురస్కరించుకొని దైవ సందేశాన్ని అందించారు. క్రీస్తు బోధనలు ఆచరణీయమని, పాపుల రక్షణ కోసం, శాంతి సందేశం కోసం దైవ దూతగా వచ్చి ఏసు మానవాళి కోసం రక్తం చిందించారని పాస్టర్ కపాకర్ తెలిపారు. పెద్దదోర్నాల్లోని రోమన్ క్యాథలిక్ చర్చ్, లూథరన్ చర్చ్, లివింగ్ ఇవాంజెలికల్ ఫెలోషిప్, సీయోను ప్రార్థన మందిరం, చర్చ్ ఆఫ్ క్రైస్ట్, తదితర చర్చిలలో క్రైస్తవ సోదరులు ఎంతో భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

టిడిపిలోకి వైసిపి నేత 'గుంటక'.?

సుబ్బారెడ్డి (ఫైల్)

ప్రజాశక్తి-మార్కాపురం

స్థానిక సంస్థల ఎన్నికలు చాలా దూరంలో ఉన్నాయి. ఏడాదిన్నర కాలం గడిచిన తరువాత మాత్రమే మార్కాపురం మున్సిపాలిటీకి ఎన్నికలు జరగనున్నాయి. అధికార పార్టీ నేతలు ఇప్పటి నుంచే దూరపు ఆలోచనతో ఉన్నారు. ఏడాదిన్నర తరువాత జరిగే ఎన్నికల్లో నెగ్గేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. వైసిపిలో కీలకమైన నేతలకు గాలం వేయడం మొదలుపెట్టారు. టిడిపి బలం మరింతగా పెంచుకునే దిశగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పావులు కదుపుతున్నట్లు సమాచారం.!

వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ గుంటక సుబ్బారెడ్డి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో కీలక నేత. తూర్పువీధికి చెందిన గుంటక సుబ్బారెడ్డి బలమైన నాయకుడుగా ముద్ర వేసుకున్నారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా... మార్కాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా మూడు దఫాలుగా గుంటక సుబ్బారెడ్డికి అవకాశం దక్కింది. ఆయన సతీమణి క్రిష్ణవేణి కూడా ఒక దఫా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా పనిచేశారు. మార్కాపురం మున్సిపాలిటీలో తనకంటూ వర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లోనూ వైసిపి విజయం కోసం పనిచేశారు. ఎంపిగా పోటీ చేసిన చెవిరెడ్డి భాస్కరరెడ్డితో పాటు ఎమ్మెల్యేగా పోటీ చేసిన అన్నా వెంకటరాంబాబు ఓటమిపాలయ్యారు. రాష్ట్రంలో వైసిపి అధికారాన్ని కోల్పోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. ఈ నేపథ్యంలో గుంటక సుబ్బారెడ్డి టిడిపిలో చేర్చుకుంటే మరింత బలం పెరుగుతుందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి భావిస్తున్నట్లు తెలిసింది. నేరుగా గుంటక సుబ్బారెడ్డితో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడినట్లు తెలిసింది. టిడిపిలో గుర్తింపు ఇస్తామని చెప్పినట్లు సమాచారం. గుంటక సుబ్బారెడ్డికి సన్నిహితంగా ఉంటున్న బాలినేని శ్రీనివాసరెడ్డి కూడా ఇప్పుడు వైఎస్ఆర్ కాంగ్రెస్‌లో లేరు. ఆయన జనసేనలోకి వెళ్లారు. జనసేనలోకి రావాలని బాలినేని కోరినా స్థానికంగా ఆ పార్టీ బలం పెద్దగా లేకపోవడంతో జనసేన పార్టీలో చేరలేదని తెలిసింది. ఎలాగూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. అందులో జనసేన పార్టీ కూడా భాగస్వామి. అదే పార్టీలో బాలినేని కూడా ఉన్నందున స్థానికంగా తెలుగుదేశం పార్టీలో గుంటక సుబ్బారెడ్డి చేరేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది. టిడిపిలో చేరిక త్వరలో ఉంటుందని, ఆయనతో పాటు పలువురు వైసిపి కౌన్సిలర్లు కూడా టిడిపిలో చేరతారని ప్రచారం జరుగుతోంది.!

వర్షానికి నేలమట్టమైన వరి పంట

◆ వేలాది ఎకరాల్లో పంట నష్టపోయిన రైతులు ◆ ఆందోళనలో రైతన్నలు

వర్షానికి నేలమట్టమైనవరి పంట దృశ్యం

ప్రజాశక్తి-దర్శి

వేలాది ఎకరాల్లో సాగు చేసిన వరి పంట అకాల వర్షాల వలన నేలమట్టమైంది. రైతులకు ఈ ఏడాది సాగర్ నీరు సక్రమంగా ఇచ్చి రూ.వేలల్లో వెచ్చించి సాగు చేసిన వరి పంట చేతికొచ్చిందన్న సమయంలో అకాల వర్షం రైతులకు నిరాశ మిగిల్చింది. రెండేళ్లుగా సాగర్ నీరు రాకపోవడంతో వరి పంట రైతులు సాగు చేయలేదు. ఈ ఏడాది ముందుగా సాగు చేసిన వరి పంటను అకాల వర్షం నిండా ముంచినట్లు రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో ముందుగా వెయ్యి ఎకరాలలో సాగు చేసిన వరి పంటకు నష్టం వాటిల్లింది. ఈ సందర్భంగా మండలంలోని లంకోజనపల్లికి చెందిన కొరివి వెంకటేశ్వర్లు తనకున్న 10ఎకరాల పొలంలో 5ఎకరాలలో ముందుగా వరి పంట సాగు చేశారు. గత మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి మూడు ఎకరాలలో సాగు చేసిన వరి పంట పూర్తిగా నేలమట్టమైంది. అంతకు ముందుగానే రెండు ఎకరాల్లో సాగు చేసిన వరి పంటను మిషన్ సహాయంతో కోసినట్లు తెలిపారు. ఈ విధంగా గ్రామానికి చెందిన దాదాపు 150 ఎకరాలలో సాగు చేసిన వరి పంట నష్టపోయినట్లు వాపోతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులను వివరణ కోరగా మండలంలో సుమారు 20వేల ఎకరాల్లో వరి పంట సాగు చేసినట్లు తెలిపారు. ముందుగా సాగు చేసిన వెయ్యి ఎకరాలలోని వరి పంటకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వర్షాలు తగ్గిన తరువాత నష్టపరిహారం అంచనాలను తయారు చేసి పంపనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారి బాలకృష్ణనాయక్ తెలిపారు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని నష్టపోయిన రైతులు కోరుతున్నారు.

కళ్ళంలో తడిచిన ఓదెలు చూపిస్తున్న రైతు కొరివి వెంకటేశ్వర్లు దృశ్యం

ఘనంగా క్రిస్మస్ సంబరాలు

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న డిబిఆర్‌సి ప్రతినిధులు

సిఎస్ పురంలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవ సోదరులు

ప్రజాశక్తి-దర్శి

క్రీస్తు జననం సందర్భంగా క్రిస్మస్ వేడుకలు మండలంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. చర్చిలను విద్యుత్ దీపాల అలంకరణతో ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్లు ప్రత్యేక బోధనలు చేశారు. అనంతరం విందు ఆరగించారు. ఈ సందర్భంగా స్థానిక డిఎస్పీ కార్యాలయం ఎదురుగా ఉన్న బాప్టిస్టు చర్చిలో పాస్టర్ జాన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అన్ని గ్రామాల్లోని పాస్టర్ల ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు.

సిఎస్ పురం : మండలంలో క్రిస్మస్ పండుగ సందర్భంగా క్రిస్టియన్ సోదరులు బుధవారం క్రిస్మస్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని పలుచర్చిలను విద్యుత్ దీపాలతో ప్రత్యేక ఆకర్షణగా అలంకరించారు. క్రిస్టియన్ సోదరులు ఉదయం నుంచే చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సిఎస్ పురంలోని మినిస్ట్రీస్ ప్రార్థన మందిరంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పాస్టర్ సామేలురాజు, బ్రదర్ రాజమోహన్ ఏసుక్రీస్తు జననం గురించి వివరించారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా డాక్టర్ మురళీధర్ ప్రసాద్ 66మంది వితంతువులకు ఉచితంగా చీరలు పంపిణీ చేశారు. సిఎస్ పురం సర్పంచ్ శ్రీరామ్ పద్మావతి, టిడిపి మండల అధ్యక్షులు బొమ్మనబోయిన వెంకయ్య, బొబ్బురి రమేష్, మన్నేపల్లి శ్రీనివాసులు, ఎంసీ మాలకొండయ్య, బత్తుల వెంకటాద్రి, జగన్నాథం, లక్ష్మి తదితర నాయకులు ప్రార్థనలో పాల్గొని ఏసుప్రభు గొప్పతనం గురించి తెలుసుకున్నారు. మండలంలోని డిజి పేట, గణేష్‌నిపల్లి, కొండబోయినపల్లి, సిఎస్ పురం, అరివేముల, మిట్టపాలెం, కంభంపాడు తదితర గ్రామాల్లో చర్చిలను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

కొనకనమిట్ల : మండలంలోని వివిధ గ్రామాలలో క్రిస్మస్ పర్వదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి నుంచే చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, కేక్ కట్ చేసి క్రీస్తు జనన సందర్భంగా ఒకరి కొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కొనకనమిట్ల తెలుగు బాప్టిస్టు షారోన్ చర్చిలో పాస్టర్ కోలా రవికుమార్, ఇజీఐ చర్చి, క్రీస్తు మందిరంలో, ఎదురాళ్లపాడు తెలుగు బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్ రెవరేండ్ గొంగటి కిషోర్‌కుమార్, సిద్ధవరం చర్చిలో పాస్టర్ ఆర్ రాజారావు ప్రత్యేక ప్రార్థనలు చేసి, క్రీస్తు పుట్టుక గురించి వాక్యోపదేశాలు చేశారు. ఆయా చర్చిలు రంగు రంగుల విద్యుత్తు దీప కాంతులతో మెరిసిపోయాయి. పెదారికట్ల పునీత బాప్టిజ యోహాన్ దేవాలయంలో ఫాదర్ ఆరోగ్యరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-దర్శి

ఏసు క్రీస్తు నేర్పిన సన్మార్గంలో నడిస్తే అందరి జీవితాల్లో వెలుగులు వీరజిమ్ముతాయని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజినల్ కో-ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు అన్నారు. క్రిస్మస్ సందర్భంగా తాళ్లూరు మండలం దారంవారిపాలెం ఎస్సీకాలనీలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌సిఎం చర్చి ఉపదేశకుడు గోపనబోయిన రోశయ్య దేవుని సందేశం వినిపించారు. లోక రక్షకుడైన ఏసుక్రీస్తు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరు నడుచుకోవాలని కోరారు. శాంతి మార్గం మానవాళి, అనుసరించాలని అన్నారు. కుల, మతాలకు అతీతంగా జరుపుకుంటున్న క్రిస్మస్ వేడుకలలో దేవుని ఆశీస్సులను పొందాలన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 30 మంది వృద్ధులు, వితంతువుకు దుప్పట్లు, స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు ఆబోతు కొండయ్య, జి నరేంద్ర, నూకతోటి సూరిబాబు, దార్ల మణిబాబు, గోవన్న అంజమ్మ పాల్గొన్నారు.

సిపిఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-కొనకనమిట్ల

ఒంగోలులో గురువారం జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవ బహిరంగ సభ, ప్రదర్శనను జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి కె కోటేశ్వరరావు, కొండయ్యలు కోరారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రదర్శన ఉంటుందని తెలిపారు. సాయంత్రం బహిరంగ సభ సివిఆర్ రీడింగ్ వద్ద జరుగుతుందని అన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ అధ్యక్షతన జరిగే సభకు సిపిఐ రాష్ట్ర నాయకులు గుజ్జుల ఈశ్వరయ్య, పలువురు నాయకులు హాజరవుతారని తెలిపారు. వందేళ్లలో ప్రజల పక్షాన పోరాటాలు చేసినట్లు తెలిపారు. కార్మికులు, రైతులు, రైతు కూలీలు, వృత్తిదారుల సమస్యలతోపాటు సామాజిక అంశాలపై సుదీర్ఘ పోరాట చరిత్ర కలిగిన కమ్యునిస్టు పార్టీ భవిష్యత్తులోనూ ప్రజల పక్షాన పోరాటం చేస్తుందని అన్నారు. సిపిఐ సభ్యులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

వధువును ఆశీర్వదిస్తున్న జంకె వెంకటరెడ్డి

వధువుకు ఆశీర్వాదం

ప్రజాశక్తి-సిఎస్ పురం

మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన మాజీ ఎంపిటీసీ, వైసిపి నాయకులు పాలుగుల్ల మల్లికార్జునరెడ్డి కుమార్తె త్రివేణి వివాహ సందర్భంగా పలువురు ప్రముఖులు హాజరై ఆమెను ఆశీర్వదించారు. కదిరి బాబురావు విద్యాసంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కదిరి పార్థసారథి, మార్కాపురం మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, వైసిపి మండల అధ్యక్షులు భువనగిరి వెంకటయ్య, నారాయణస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి తదితరులు హాజరై వధువును ఆశీర్వదించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, వైసిపి కార్యకర్తలతో జంకె వెంకటరెడ్డి ఆత్మీయంగా కొద్దిసేపు మాట్లాడారు.

వెంకట నారాయణకు నివాళి అర్పిస్తున్న దద్దాల నారాయణ

వెంకట నారాయణ మృతికి నివాళి

ప్రజాశక్తి - పీసీపల్లి

మండలంలోని తలకొండపాడు గ్రామానికి చెందిన మాజీ వాలంటీరు రాయల వెంకట నారాయణ అకాల మృతికి వైసీపీ ఇన్చార్జి దద్దాల నారాయణ యాదవ్ బుధవారం నివాళులర్పించారు. వెంకట నారాయణ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మనో ధైర్యంగా ఉండాలని అన్నారు. ఆ కుటుంబానికి అండగా వైసీపీ వుంటుందని తెలిపారు. రూ.25వేల ఆర్థిక సహాయం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆయన వెంట వైసిపి మండల నాయకులు పోలు జయరామిరెడ్డి, యేరువ నరసింహం, నెలకుర్తి బ్రాహ్మయ్య(రెడ్డి), నెలకుర్తి వెంకటేశ్వర్లు, మూలే శేఖర్, నాగోతు శ్రీకాంత్, రేగుల బాలయ్య, గోనుగుంట్ల వెంకటేశ్వర్లు ఉన్నారు.

27న విద్యుత్ ఛార్జీలపై వైసిపి పోరు

ప్రజాశక్తి-దర్శి

ఈ నెల 27న శుక్రవారం కరెంట్ చార్జీల బాదుడుపై వైఎస్ఆర్‌సిపి పోరుబాట నిర్వహించనున్నట్లు వైసిపి మండల అధ్యక్షుడు వెన్నపూస వెంకటరెడ్డి బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే, వైఎస్ఆర్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బుచేపల్లి వెంకాయమ్మ పాల్గొంటారని అన్నారు. వైసిపి శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని పోరుబాట జయప్రదం చేయాలని కోరారు.

అన్నదానం చేస్తున్న హనుమాన్ నాయక్ కుటుంబ సభ్యులు

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి-దర్శి

స్థానిక శిరిడి సాయిబాబా వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ముండ్లమూరు మండలం పులిపాడు తాండకు చెందిన ఒడిసా లక్ష్మీనాయక్, శ్రీలక్ష్మీబాయి జ్ఞానపార్థకంగా వారి కుమారుడు హనుమాన్‌నాయక్, కోడలు రాజీబాయి బుధవారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వాహనదారుల లైసెన్స్ పరిశీలిస్తున్న పోలీసులు

లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు

ప్రజాశక్తి-సిఎస్ పురం

లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఆర్ సుమన్ తెలిపారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో వాహనదారుల లైసెన్స్‌లను బుధవారం పరిశీలించారు. లైసెన్సు లేని వారిపై చలానాలు విధించారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం నేరమని తెలిపారు. వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

వాగుల ఆక్రమణతో వరద ప్రమాదం

◆ వరదల సమయాల్లో ఇబ్బంది పడుతున్న ప్రజలు ◆ ఆక్రమణలపై పట్టించుకోని అధికారులు ◆ ఆక్రమణలపై అధికారులకు ప్రజాసంఘాల ఫిర్యాదు

ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఐక్యవేదిక నాయకులు

ప్రజాశక్తి - కనిగిరి

పట్టణంలో ఆక్రమణలకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. వాగులు, వంకలు సైతం ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారు. ఖాళీ స్థలాలనే కాదు ఆక్రమణదారులు బరితెగించి కొండవాగులు, చెరువు అలుగు వాగులను ఆక్రమించి దర్జాగా నిర్మాణాలు చేస్తున్నారు. తమను అడ్డుకునేవాళ్లు లేరనే ధీమా వ్యక్తం చేస్తున్నారు.

వాగులు వంకలు మాయం

పట్టణంలోని కొండ నుంచి నాగుల చెరువు వరకు, నాగుల చెరువు నుంచి ఆర్టిసి డిపో మీదుగా వెళ్లే వాగు, కనిగిరి పెద్ద చెరువు నుంచి కొత్తూరు మీదుగా కనకపట్నం వైపు వెళ్లే వాగు, గార్లపేట రోడ్డు నుంచి ఎన్జీఓ కాలనీ, శివనగర్ కాలనీ, కాశీనాయన గుడి ప్రాంతం మీదుగా ఆర్టిసి డిపో వైపు వెళ్లే వాగులు ఆక్రమణకు గురై మురుగు కాల్వలను తలపిస్తున్నాయి. వాగులు, వంకలు ఆక్రమణకు గురై కుదించుక పోవడంతో వర్షం వచ్చిందంటే వర్షపు నీరు పట్టణంలోని నివాస ప్రాంతాల్లోకి చేరుతున్నాయి. ఆ ప్రాంతాలు ముంపుకు గురవుతున్నాయి. శివారు ప్రాంతాల పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. నివాసాల్లోకి వర్షపు నీరు, మురుగు నీరు వచ్చి చేరడంతో దిక్కు తోచని స్థితిలో ప్రజలు అల్లాడుతున్నారు. వర్షం తగ్గిన తర్వాత ముంపు వలన నివాసాల్లో చేరిన మురుగు, బురద తొలగించుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లలో సామాన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు చెడిపోతున్నాయి. వ్యాధులు ప్రబలి అనారోగ్యంతోపాటు ఆర్థికంగా దెబ్బతింటున్నారు. వర్షాల కారణంగా ముంపునకు గురైన నివాసాల ప్రజలకు అధికారులు, నాయకుల పరామర్శలే తప్ప సహకారం అందడం లేదు. ఒకవేళ సహకారం అందిన అరకొరగా ఒకరిద్దరు రాజకీయ పలుకుబడి కలిగిన వారికి మాత్రమే అందుతుంది.

ఆక్రమణలపై అధికారులకు ప్రజాసంఘాల ఫిర్యాదులు

ఆక్రమణల కారణంగా ముంపునకు గురైతన్న ప్రాంతాలను ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు సందర్శించారు. ప్రజల బాధలు తెలుసుకొని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ముంపు ప్రాంత ప్రజలకు సహకారం అందడం లేదు.

ఆక్రమణ దారులపై చర్యలేవి

ఆక్రమణల తొలగింపు చర్యలపై తాము కాదంటే తామంటూ అధికార యంత్రంగా ఒకరిపై ఒకరు చెప్పుకుని తప్పుకుంటున్నారు. దీంతో ఆక్రమణలకు అడ్డా అదుపు లేకుండా పోతుంది. ఇరిగేషన్, రెవిన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్ తదితర శాఖల అధికారులు వాగులు, వంకలు ఆక్రమణలు జరక్కుండా, జరిగిన ఆక్రమణలు తొలగించేలా చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తులో కనిగిరి పట్టణానికి వరదల కారణంగా పెను ప్రమాదం సంభవించే ప్రమాదం ఉంది. పెద్ద మొత్తంలో ఆస్తి, ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాగులు, వంకలు ఆక్రమణలపై జిల్లా ఉన్నతాధికారులు చొరవ చూపాలని, తక్షణం తగు చర్యలు చేపట్టాలని, ఆక్రమణలు తొలగించాలని పట్టణ ప్రజలు, ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు కోరుతున్నారు.

ఆర్టీసీ డిపో వెనుక వైపు ఆక్రమణకు గురైన వాగు

వర్షాలకు ముంపునకు గురైన శివనగర్ కాలనీ (ఫైల్)

కన్నుల పండుగగా క్రిస్మస్ వేడుకలు

లూధరన్ చర్చిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

విద్యుత్ కాంతులతో ఆకర్షణీయంగా లూదరన్ చర్చ్

ప్రజాశక్తి - చీరాల

సర్వ మానవాళికి క్రీస్తు బోధనలు ఎంతో మార్గదర్శకమని, ప్రేమ, శాంతి, సమాధానంతో ప్రజలు జీవించాలని శాసన సభ్యులు ఎంఎం కొండయ్య అన్నారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా ప్రార్థన మందిరాల్లో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన బాపట్ల ఎంపి ప్రసాద్‌తో కలసి హాజరయ్యారు. క్రైస్తవులందరూ ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకునే క్రిస్మస్ వేడుకలకు తామ హాజరు కావటం చాలా అనందంగా ఉందని అన్నారు. క్రిస్మస్ వేడుకల్లో భాగంగా పట్టణంలోని సెయింట్ మార్క్స్ లూథరన్ చర్చ్ విద్యుత్ కాంతులతో ప్రత్యేకంగా అలకరించారు. సాల్మన్ సెంటర్లోని బేర్ క్రిస్టియన్ చర్చ్ ఎంతో వైభవంగా విద్యుత్ దీపాలతో అలంకరించటంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మరియమ్మపేట సెయింట్ పునీత ఆంతోని చర్చిని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆనందపేట, జయింతిపేట, హైయిర్ పేట, శృంగరపేట, విఠల్‌నగర్, విజిలిపేట, ఐక్యనగర్‌తో పాటు అన్ని ప్రార్థనా మందిరాలను అలంకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు.

విద్యుత్ కాంతులతో బేర్ క్రిస్టియన్ చర్చ్

'పగలే చోరీ' కేసులో నిందితురాలు అరెస్టు

రూ.12.50 లక్షల సొత్తు స్వాధీనం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

పగటి పూట ఇళ్లలో చోరికి పాల్పడిన నిందితురాలిని పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.12.50లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించటంలో ప్రతిభ చూపిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్‌పి ఏఆర్ దామోదర్ అభినందించారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పామూరులో నివసిస్తున్న వేముల అఖిల, కనిగిరి పట్టణం పాతకూచిపూడిపల్లికి చెందిన బత్తుల వెంకట రమణ ఇరువురు బంధువులని తెలిపారు. అఖిల వెంకట రమణ ఇంటికి తరచూ వెళుతూ ఉండేదని, ఆమె వెంకట రమణ ఇంట్లో వస్తువులు, డబ్బులు, బంగారు వస్తువులు పెట్టె స్థలం, బీరువా తాళాలు పెట్టె చోటు గమనించి వాటిని దొంగిలించుకోవాలని నిర్ణయించుకుందన్నారు. 2023 ఏప్రిల్ 1న ఫిర్యాది కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయంలో నిందితురాలు ఇంట్లోకి వెళ్ళే క్రమంలో మెట్ల కింద ఉన్న ఇంటి తాళాలు, డ్రెస్సింగ్ టేబుల్‌లోని తాళాలతో బీరు తెరిచి రూ.12.50లక్షల విలువైన 25సవర్ల బంగారం దొంగిలించిందన్నారు.

ఎస్ఐ, సిఐలను అభినందిస్తున్న ఎస్‌పి ఎఆర్ దామోదర్

నేర పరిశోధన సాగిందిలా

ప్రస్‌పి ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు అదనపు ఎస్‌పి కె నాగేశ్వర రావు, కనిగిరి డిఎస్పీ ఎం మహేశ్వరరావు ఆధ్వర్యంలో కనిగిరి సిఐ షేక్ ఖాజావలి, కనిగిరి ఎస్సై శ్రీరామ్, హెచ్ఎం పాడు ఎస్సై మాధవరావు సిబ్బందితో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టి నిందితురాలికి సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. డబ్బులు ఆవసరం కావటంతో దొంగిలించిన బంగారు ఆభరణాలను అమ్ముకొనుటకు ఒంగోలు వెళుతోందనే విషయం తెలుసుకున్న సిఐ సిబ్బందితో కలిసి ఆర్టీసి డిపో వద్ద బుధవారం అరెస్టు చేసి ఫిర్యాది ఇంట్లో దొంగిలించిన బంగారు చైనులు-6, 3జతల కమ్మల, ఉంగరాలు-4, బ్రాస్లెట్-1, నెక్లెస్-1, పాపిడి బిళ్ళ-1, నల్లపూసల దండ-1, బంగారు మాటిలు స్వాదీనం చేసుకున్నారు. దొంగతనం కేసును ఛేదించడంలో కీలక పాత్ర పోషించిన పోలీసులను ఎస్‌పి ఏఆర్ దామోదర్ అభినందించారు. కనిగిరి సిఐ షేక్ ఖాజవలి, కనిగిరి, హెచ్ఎంపాడు ఎస్ఐలు శ్రీరామ్, మాధవరావు, కానిస్టేబుళ్ళు శ్రీనివాసులు, శోభన్ బాబు, బాల గురవయ్య, రామయ్యను అభినందించి ప్రశంస పత్రాలు అందజేశారు.

వధూ, వరులను ఆశీర్వదిస్తున్న శిద్ధా రాఘవరావు

వధూవరులకు శిద్దా ఆశీర్వాదం

ప్రజాశక్తి-దర్శి

ఇటీవల వివాహము జరిగిన పోలినేని వెంకటేశ్వర్లు, ఆదిలక్ష్మి కుమారుడి వివాహ రిసెప్షన్ వేడుకలో మాజీ మంత్రి శిద్దా రాఘువారావు పాల్గొని వధూ, వరులు వెంకట హరీష్, నాగ హంసికలకు పుష్ప గుచ్చం ఇచ్చి బుధవారం ఆశీర్వదించారు. తదనంతరం షాలువతో శిద్దా రాఘువారావును పోలినేని వెంకటేశ్వర్లు, ఆదిలక్ష్మి ఘనంగా సత్కరించారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న బోనేని వెంకటేశ్వర్లు యాదవ్

నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - గిద్దలూరు

ప్రస్తుతం పట్టణంలో చలి అధికంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వృద్ధులతోపాటు చిన్న పిల్లలు, ఆస్మా వ్యాధి గ్రస్తులు ఇబ్బందులకు గురికావడంతో పాటు వైద్యుల సలహాలను పాటిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నిరాశ్రయులకు అమ్మ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు, టీడీపీ కోమరోలు మండల అధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ 60 మందికిపైగా నిరాశ్రయులు, యాచకులకు బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుప్పట్లు పంపిణీ చేయడం తమకెంతో సంతోషాన్ని, సంతృప్తిని ఇచ్చిందని తెలిపారు. పందనబోయిన భూపాల్, బిఎస్ నారాయణరెడ్డి, డిష్ బాల అంకయ్య, అనిల్, నారాయణ, రంగస్వామి పాల్గొన్నారు.

బహుమతులు అందజేసిన అట్లూరి సుష్మానంద్

బహుమతులు అందజేత

ప్రజాశక్తి-దర్శి

మండలంలోని తూర్పు వీరాయపాలెం మండల ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో బుధవారం క్రిస్మస్ పండుగ వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ముండ్లమూరు మండలం ఈదర గ్రామంకు చెందిన దైవజనులు గుంటూరు కోటేశ్వరరావు క్రీస్తు నందు ప్రార్థన చేసి అనంతరం ఆయన మాట్లాడారు. ప్రధానోపాధ్యాయుడు వి రవికుమార్ మాట్లాడుతూ బాల బాలికలు చదువుతోపాటు అన్ని రంగాల్లో ముందుండాలని అన్నారు. కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. పాఠశాల పిల్లలకు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు, ఏకెఎన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అట్లూరి సుష్మానంద్ ఆధ్వర్యంలో బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇట్లా వెంకటేశ్వర్లు, బి శ్రీనివాసరావు, ఆంజనేయులు, నాగార్జున, విక్రమ్, మస్తాన్‌బి తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి స్వామి

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-టంగుటూరు

ప్రజాశక్తి-2025 క్యాలెండర్‌ను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి బుధవారం తూర్పునాయుడుపాలెంలోని ఆయన స్వగృహంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజాశక్తి దినపత్రిక విలువలతో కూడిన వార్తలతో సమాజానికి దిశా నిర్దేశం చేస్తుందన్నారు. ప్రజాశక్తి క్యాలెండర్లో వేస్తున్న సీనరీలు, డిజైన్లు చాలా చక్కగా ఉంటాయని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ కోటా శ్రీహరి రావు, టిడిపి నాయకులు దామచర్ల పిచ్చన్న పాల్గొన్నారు.

నీట్ అకాడమీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్

విద్యతోనే ఉన్నత జీవితం సాధ్యం

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

విద్య ద్వారానే సమాజం లో ఉన్నతమైన జీవితం గడవవచ్చని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు పేర్కొన్నారు. స్థానిక మంగ మూరు రోడ్డులోని శ్రీ వశిష్ట వెలాసిటీ ఐఐటి, నీట్ అకా డమీని ఎమ్మెల్యే దామచర్ల బుధవారం ప్రారంభించారు. తరువాత అకాడమీ కొత్త బ్లాక్‌ను ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్లకు అకాడమీ డైరెక్టర్ నిమ్మల శ్రీకాంత్ దంపతులు ఘన స్వాగతం పలి కారు. అనంతరం ఎమ్మెల్యే కొత్త గదులను ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ తల్లిదండ్రు లు వారి పిల్లలను విద్యారంగంలో ఉన్నతంగా రాణించేలా చూడాలన్నారు. అకాడమీ డైరెక్టర్ నిమ్మల శ్రీకాంత్ మాట్లాడు తూ మూడేళ్ళ క్రితం స్థాపించిన అకాడమీ ద్వారా ఎంతో మంది ఎంబిబిఎస్, సీట్లతో పాటు వెటర్నరీ, బిడిఎస్ సీట్లను పొందారన్నారు. తమ అకాడమీని ఎంతగానో ఆదరిస్తున్న తల్లిదండ్రులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త మండవ మురళీకృష్ణ, కరస్పాండెంట్ కృష్ణప్రియ, డైరెక్టర్ శ్రీకాంత్, ప్రిన్సిపల్ షేక్ యాసిన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న దాతలు

అనాథాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - గిద్దలూరు

పట్టణంలోని పీఆర్ కాలనీలో సంజీవని అనాథాశ్రమంలో యశ్వంత్ ఎడ్యుకేషన్ సొసైటీ గౌరవ అధ్యక్షులు మొర్రి పిచ్చయ్య, తిరుపతమ్మల చిన్న కుమారుడు మొర్రి సుమంత్ జన్మదినం సందర్భంగా బుధవారం జన్మదిన వేడుకలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మొర్రి పిచ్చయ్య, తిరుపతమ్మ దంపతులకు ఆశ్రమ నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు రాజశేఖర్, పోలయ్య, ఫరూక్, పరమేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒంటి చేత్తో.. బతుకు బండి నడిపిస్తూ..

ఆటో నడుపుతూ కుటుంబ పోషణ -ఆదర్శంగా నిలుస్తున్న వికలాంగుడు

ప్రజాశక్తి-కొండపి

వికలాంగుడని కుంగిపోలేదు.. చదువుకు తగిన ఉద్యోగం రాలేదని చింతించలేదు.. ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూడలేదు.. తన సొంత కాళ్లపై నిలబడి నలుగురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. కొండపి మండలంలోని ఇలవర గ్రామానికి చెందిన వికలాంగుడు ఆముదాల శివ తన లోపాలను గుర్తు చేసుకుంటూ కుంగిపోకుండా ఒక్క చెయ్యి మాత్రమే ఉన్నా.. దాంతోనే తల్లిదండ్రులు, బార్యను, ఇద్దరు పిల్లలను ఆటో తోలి పోషిస్తున్నాడు.

భార్య, పిల్లలు, తల్లిదండ్రులను చూసుకుంటూ...

ఆముదాల శివ వయస్సు సుమారు 33 సంవత్సరాలు. తన తల్లిదండ్రులు నరసింహం, కోటేశ్వరమ్మ దంపతులకు ముగ్గురు కుమారులలో చిన్నవాడైన శివ పుట్టుకతోనే ఒక ఎడమ చెయ్యి లేదు. వైకల్యాన్ని అధిగమిస్తూనే చదువు కొనసాగించాడు. 2013లో టిటిసి పూర్తి చేశారు. అనంతరం దూర విద్యలో బిఏ డిగ్రీ కూడా చేశారు. టిటిసి పూర్తయినా గతంలో డిఎస్సీ ప్రకటన వెలువడే సరికి ఉపాధ్యాయ అర్హత (టెట్)లో అర్హత సాధించలేకపోయారు. ఆ తర్వాత మళ్లీ కష్టపడి టెట్‌లో అర్హత పొందాడు. అప్పటి నుంచి డీఎస్సీ ప్రకటన లేకపోవడంతో కుటుంబ పోషణ కోసం ఎన్నో ప్రయత్నాలు చేశారు. తన వైకల్యాన్ని చూసి ప్రైవేటు ఉద్యోగాలు రాలేదని శివ ఏ మాత్రం ఆలోచించకుండా కొత్త అవకాశాలను వెతుక్కున్నారు. అందులో బాగంగానే జరుగుమల్లి మండలం కామేపల్లి యూనియన్ బ్యాంకు సహకారంతో ఎలక్ట్రికల్ ఆటోను కొనుగోలు చేశారు. శివకు రెండు సంవత్సరాలు క్రితమే వివామైంది. బార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరితో పాటు తల్లిదండ్రులను కూడా ఇతనే చూసుకుంటున్నారు.

వాహనంలో మార్పులు చేయించి ముందుకు...

తనకు ఎలాంటి ఉద్యోగాలు రాకపోవడంతో శివ వినూత్నంగా ఆలోచించారు. కుటుంబాన్ని పోషించడం కోసం ఎలక్ట్రికల్ ఆటో కొనుగోలు చేశారు. ఒక్క చెయ్యి మాత్రమే కలిగి ఉన్న శివ హ్యాండిల్‌లో ఆటో నడపడం కష్టంగా బావించాడు. దానికి అదనంగా రూ.20 వేలు ఖర్చు చేసి హ్యాండిల్‌కు బదులు స్టిరింగ్ అమర్చారు. అయితే ఎక్సలేర్‌ను కూడా చేతిలో కాకుండా కాలితో ఉపయోగించేలా తన కాలి వద్ద అమర్చుకున్నాడు. రోజూ కొండపి-కామేపల్లి మధ్య ప్రయాణికులను ఎక్కించుకుంటూ స్వయం ఉపాది పొందుతున్నాడు. ఆటోకు సుమారు రూ.3.8 లక్షలు ఖర్చు అయిందని రోజుకు రూ.600-700 వరకు ఆదాయం వస్తుందని ఇందులోనే కుటుంబ పోషణకు పోను, మిగిలిన డబ్బులను ప్రతినెలా ఆటోకు ఫైనాన్స్ కడుతున్నానని శివ చెబుతున్నారు.

క్రీడల్లోనూ ప్రతిభ చాటుతూ..

వైకల్యం ఉందని శివ ఆటలను వదివేయలేదు. చిన్నప్పటి నుంచి క్రికెట్‌పై మక్కువతో అంగవైకల్యం పక్కకునెట్టి పట్టుదలతో బౌలింగ్ నేర్చుకున్నాడు. దివ్యాంగుల క్రికెట్ సంఘం ఆద్వర్యంలో జరిగే పోటీల్లో పాల్గొని బౌలింగ్‌లో రాష్ట్ర స్థాయిలో గుర్తింపు సాదించారు. ప్రతి సంవత్సరం ఆంధ్రా నుంచి క్రికెట్ పోటీలకు అవకాశం రాకపోతే నిస్సహాయకుడిగా ఆగిపోలేదు. పక్క రాష్ట్రం తమిళనాడు తరపున టి-20 క్రికెట్ పోటీల్లో పాల్గొంటూ ఇప్పటికే ఎన్నో బహుమతులు సాదించాడు.

ఆటో నడుపుతున్న ఆముదాల శివ

ప్రభుత్వం నుంచి ఉద్యోగ అవకాశం కల్పించాలి

టిటిసి, డిగ్రీ పూర్తి చేసినా అంగవైకల్యాన్ని చూసి ఎవరూ ఉద్యోగం ఇవ్వకపోవడంతో ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాను. ప్రభుత్వం దివ్యాంగుల కోటాలో ఉద్యోగ అవకాశం కల్పించాలి.

- ఆముదాల శివ

'ఆరోగ్య' లక్ష్యాల సాధనకు కృషి

డిఎంహెచ్ఒగా డాక్టర్ వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సాధించటానికి అందరి సహకారంతో కృషి చేస్తానని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు తెలిపారు. బాపట్ల జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ టి.వెంకటేశ్వర్లు డిఎం,హెచ్ఒగా ఉద్యోగోన్నతిపై ప్రకాశం జిల్లాకు బదిలీ చేశారు. బుధవారం బాధ్యతలు స్వీకరించిన డిఎం,హెచ్ఓ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజలకు మెరుగైన సేవలు అందించటమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. జిల్లాలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సాధించటంలో ప్రోగ్రాం అధికారులు, ఇతర సిబ్బంది సహాయ సహకారాలతో జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉంచటానికి కృషి చేస్తామన్నారు. డిఎం,హెచ్ఒగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ టి.వెంకటేశ్వర్లును పలు విభాగాల అధికారులు, సిబ్బంది అభినందించారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటేశ్వర్లు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

నాగులుప్పలపాడులో బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని గుమ్మళంపాడు అంబేద్కర్‌నగర్ చర్చిలో బుధవారం క్రిస్మస్ వేడుకలు పాస్టర్ జాన్ బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మాజీ సొసైటీ అధ్యక్షులు బొక్కిసం శివరామయ్య కుమార్తె ఎన్ఆర్ఐ కె.లక్ష్మి ప్రసన్న ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేకు ను మండల వైసీపీ కన్వీనర్ దుంపా చెంచి రెడ్డి, జడ్పీటీసీ దుంపా రమణమ్మ, మాజీ సొసైటీ అధ్యక్షులు దుంపా యలమందారెడ్డి, బి.శివరామయ్య, పాస్టర్ జాన్ బాబు, గ్రామ సర్పంచి షేక్ పాశ్చా సాహెబ్, మాజీ సర్పంచ్ బి.రమాదేవి తదితరులు కేక్ కట్ చేశారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు జె.శ్రీనివాసరావు, తిరుపతి స్వామి, సంకే విజయ్ కుమార్, సిహెచ్ చేజర్లయ్య, బొడ్డపాటి శ్రీనివాసరావు, సంఘస్తులు పాల్గొన్నారు.

గిద్దలూరు: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని పీఆర్ కాలనీలో జీసస్ హోలీ చర్చిలో ప్రార్థనలు జరిగాయి. పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో చర్చి ప్రాంగణం కిటకిటలాడింది. తెల్లవారు జామున 10 గంటలకు మొదటి ఆరాధనతో క్రిస్మస్ వేడుకలు ప్రారంభం కాగా పాస్టర్ జీవీ నారాయణ శామ్యూల్ భక్తులకు దైవ సందేశం అందించి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఏసు క్రీస్తు జననం మానవాళి అంతటికీ శుభదినం అని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. చర్చిలో చిన్నారుల నృత్యాలు, పాటలు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం పాస్టర్ జాషువా భక్తులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు అందజేశారు.

నాగులుప్పలపాడు: మండలంలో బుధవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. పలుచోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఉప్పుగుండూరులో క్రిస్టియన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం పలువురిని ఆకట్టుకుంది. జయంతిపేటలో క్రీస్తుసంఘం చర్చిలో క్రిస్మస్ సందర్భంగా ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు బహూకరించిన దుస్తులను బాలికలకు పాస్టర్ నరేష్ అందజేశారు.

గిద్దలూరు రూరల్: గిద్దలూరు మండలం ముండ్లపాడు సిఓఎం చర్చి క్యాంపస్‌లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో గిద్దలూరు పట్టణానికి చెందిన రిటైర్డ్ సెంట్రల్ రిజర్వ్ ప్రొటెక్షన్ ఫోర్స్ హెడ్ కానిస్టేబుల్ బళ్లారి రాంబాబు దంపతులు 2025 నూతన క్యాలెండర్ ఆవిష్కరించి పాస్టర్లకు, దైవజనులకు, ప్రజలకు పంపిణీ చేశారు. గత పది సంవత్సరాలుగా క్రిస్మస్ పండుగ సందర్భంగా రాంబాబు క్యాలెండర్లు ముద్రించి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎంవో డైరెక్టర్ వి.టైటస్, గ్రేట్ ఫెయిత్ మినిస్ట్రీస్ డైరెక్టర్ వి.హనోక్ తదితరులు పాల్గొన్నారు.

ముండ్లపాడులో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

గిద్దలూరులో మాట్లాడుతున్న పాస్టర్

కొండపి: చిన్నారులు క్రిస్మస్ సంబరాలలో పాటలు పాడారు. క్రిస్మస్ పండుగను పురష్కరించుకుని బుధవారం కొండపిలోని యెరుషాలెము చర్చిలో పాస్టర్ సాంబశివరావు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రభువైన ఏసు పాపుల కొరకు శిలువ వేయబడ్డాడని చెప్పారు. ఆయన శిలువపై కార్చిన విలువైన రక్తంతో ప్రజల పాపాలు కడిగారన్నారు. ఆయన పుట్టుకకు ప్రతీకగా జరుపుకునే క్రిస్మస్ పండుగ యావత్తు ప్రపంచానికే ఓ శుభదినమని ఆయనతెలిపారు.అనంతరం కేకు కట్ అందరికి పంచిపెట్టారు. అలాగే సంఘస్థుల కోసం ప్రేమ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బాగంగా కొండపితో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లోని చర్చిలు నూతన శోభ సంతరించుకున్నాయి.